Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం, ఆగస్టు 06, 2026 | సంపుటి - 20 | సంచిక 309 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

### మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్‌ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని 2లో




## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

### పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్

### సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

హైదరాబాద్ : తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లోకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు.

తరువాయి 2లో



## తుమ్మడిహట్టి పెంపునకు ఒత్తిడి తెండి

### మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

### కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

### అటవీ పర్యావరణ అనుమతలుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

### ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

### బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

న్యూఢిల్లీ : తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. 150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి 2లో



## క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

### లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా

### నిజామబాద్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్

నిజామాబాద్ : తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడి యాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నా యని అన్నారు. నిజామా బాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమ యంలో సమాధానం చెబుతానని,

తరువాయి 2లో

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

### గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

### 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్ : ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు. కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కోండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. 2లో

## డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

### ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు

### విశాఖలో సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



విశాఖపట్నం : ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోం దన్నారు. సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో

తరువాయి 2లో


## ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

### ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు

### కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. 2లో





## సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి

### వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టులకు ప్రణాళిక

### రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు

### విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై చంద్రబాబు

అమరావతి : సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు.

# హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే ఈ చర్చలు సాగుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# తుమ్మిడిహట్టి పెంపునకు ఒత్తిడి తెండి

జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్‌ఎస్పీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

# సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి

ఈ సందర్భంగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ.3.50 నుంచి రూ.4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించేలా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు. రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు.. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖ రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని.. ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ ఉండాలన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలన్నారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు. నిధుల కన్వ్జగ్గ÷న్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలన్నారు.

# తమిళనాట తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

**'అన్నన్ సీర్ తిట్టమ్'నకు బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయింపు**

**పథకం కింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర**

చెన్నై : తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందనున్నారు. రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందించేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బ్జడెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు. 'పుతియా పయనం-పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటిల్ బాటిళ్లు ఇవ్వనున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2,500, ఏడాదికి ఉచితంగా 6 వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్లో ప్రకటన రాలేదు.

# తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జీఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్దా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# జగన్‌పై అవినీతి కేసులపై రాజ్యసభలో టిడిపి ప్రస్తావన

**13 ఏళ్లవుతున్నా తేలడం లేదంటూ ఎంపి విజయ్ వెల్లడి**

**సుప్రీం జడ్జిల బిల్లుపై చర్చలో ప్రస్తావనను ఆక్షేపించిన డిప్యూటి ఛైర్మన్**

న్యూఢిల్లీ,ఆగస్ట్5 : పార్లమెంట్, రాజ్యసభలో ప్రతిపాదించిన 'సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు - 2026'పై మాట్లాడే క్రమంలో జగన్ కేసుల విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ ప్రస్తావించారు. దాదాపు కొన్నేళ్లుగా కేసుల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈ-కోర్టులు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను ఎంపీ విజయ్ సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవడమంటే న్యాయం నిరాకరించినట్లేనని ఎంపీ విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభ సాక్షిగా ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సీబీఐ, ఈడీ కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగలేదని ప్రశ్నించారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఎంపీ విజయ్ కుండబద్దలు కొట్టారు. అయితే డిప్యూటీ ఛైర్మన్ ఈ వ్యాఖ్యల ప్రస్తావనను ఆక్షేపించారు. బిల్లుపై మాత్రమే మాట్లాడాలని అన్నారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపీ విజయ్ తెలిపారు. ఈ వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కిందిస్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సీబీఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపీ చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు.

# డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎ÷-లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

# క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

**బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

హైదరాబాద్,ఆగస్ట్5 : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6-7 ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బ్జడెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యా లయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# క్యుములోనింబస్ మేఘాల ప్రభావం

**భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ**

హైదరాబాద్,ఆగస్ట్5 : క్యుమిలోనింబస్ మేఘాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వెల్లడించింది. హైదరాబాద్ సహ 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ అయ్యింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువొచ్చు. కాగా, గడిచిన 24 గంటల్లో 4 మండలాల్లో 11.56 సెం.మీ నుంచి 20.44 సెం.మీ మధ్య వర్షపాతం నమోదైంది. 6.45 సెం.మీ నుంచి 11.55 సెం.మీ మధ్య 40 మండలాల్లో, 1.56 సెం.మీ నుంచి 6.44 సెం.మీ మధ్య 281 మండలాల్లో వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది.

# 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

### నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు

### మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు

న్యూఢిల్లీ,ఆగస్ట్5 : నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్షకులని, కుప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నించడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వాత 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్ధరహితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.



## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

### నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

### 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్5 : హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫై÷ర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్‌ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## కుటుంబ కలహాలతో తండ్రి రాక్షసత్వం

### నాలుగేళ్ల కుమారుడుని బండకేసి కొట్టిన దుర్మార్గుడు

హైదరాబాద్,ఆగస్ట్5 : నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రి.. నాలుగేళ్ల కుమారుడిపై దారుణంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తండ్రి సల్మాన్.. కొడుకు అర్మాన్‌ను ఓ పిల్లర్‌కు బలంగా కొట్టి నేలపై పడేశాడు. అంతటితో ఆగకుండా బాలుడిని లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు బాలుడిని కాపాడారు. తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని నిందితుడు సల్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

## జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

### దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

### రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

### సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

ముంబై,ఆగస్ట్5 : జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎపిఎన్ఆర్టీ కోఆర్డనేటర్ల నియామకం

అమరావతి,ఆగస్ట్5 : ఏపీ ఎన్ఆర్టీ కోఆర్డినేటర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండో విడత జాబితాలో నియమించింది. రెండో విడతలో 292 మందిని కోఆర్డినేటర్లుగా నియమించింది. ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి సంక్షేమం కోసం ఈ నియామకాలు చేపట్టినట్లు ఏపీ ఎన్ఆర్టీ ప్రకటించింది. భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంద సేవలు అందించేందుకు కోఆర్డినేటర్లు సహకరిస్తారని తెలిపింది. కొత్తగా కోఆర్డినేటర్లుగా నియమితులైన వారికి ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ప్రెసిడెంట్ వేమూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

## పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

### తుదిదశకు మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు

### పనులను పర్యవేక్షించన మంత్రులు

హైదరాబాద్,ఆగస్ట్5 : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కోడలు ఇంట్లో అత్తకు నివసించే హక్కు ఉంది

### హిమాచల్ మైకోర్టు సంచలన తీర్పు

సిమ్లా,ఆగస్ట్5 : కోడలి ఇంట్లో అత్తగారు కూడా నివసించే హక్కు ఉంటుందని హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తన సొంత సంపాదనతో కట్టుకున్న ఇంటిలోంచి వెళ్లిపోవాలని అత్తమామలకు కోడలి ఆదేశించడంతో బాధిత అత్తగారు గృహ హింస కింద కేసు పెట్టింది. విచారణ సందర్భంగా ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి కూడా పూర్తిగా ఉంటుందని న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మండి జిల్లాల్లోని రామ్‌నగర్‌కు చెందిన వ్యక్తితో 2013, మే నెలలో వివాహం జరిగింది. 2014 వరకు అత్తమామలతోనే కోడలి నివసించింది. అయితే ఇంతలో వివాదాలు తలెత్తడంతో అత్తమామలను ఇంట్లో నుంచి గెంటేసింది. 2025, నవంబర్ 7న ఇంట్లో నుంచి పంపేసి అ÷-దదెకు ఇచ్చేసింది. దీంతో అత్తగారు గృహ హింస కేసు పెట్టింది. అయితే తన సొంత సంపాదనతో నిర్మించుకున్న ఇల్లు అని దిగువ కోర్టులో కోడలు పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి రాకేష్ కాంతాలా విచారించి కొట్టేశారు. ఉమ్మడి ఇంట్లో అత్తగారికి హక్కు ఉంటుందని తెలిపింది. అయితే కోడలిపై అత్తగారు పెట్టిన గృహ హింస కేసు తాజాగా హైకోర్టులో విచారణ రాగా.. కోడలి ఇంట్లో అత్తగారికి నివసించే హక్కు ఉంటుందని.. ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. ఇరుపక్షాలు కలిసి నివసించినప్పుడు అందరికీ హక్కులు ఉంటాయని తెలిపింది. అత్తమామలు బయటకు పంపేసి అ÷-దదెకు ఇవ్వడం ఏ మాత్రం సరైందని కాదని పేర్కొంది. గృహ సంబంధంలో నివసిస్తున్న ప్రతి మహిళకు, ఆమె కుమార్తె, సోదరి, భార్య, కోడలు, అత్త అయినా సరే.. ఉమ్మడి గృహంలో నివసించే చట్టపరమైన హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది.

డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

## సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి

### సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

### - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్,ఆగస్ట్5 : డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ÷బిరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

### పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5 : భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు.

## గోదావరి వరదలకు చెక్ పెట్టేందకు నిర్ణయం

### వరదల నుంచి రక్షణకు కరకట్ట నిర్మాణం

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5 : ప్రతి ఏడాది గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల ప్రజలకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి వరదల నుంచి మండలంలోని పలు గ్రామాలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలి దశలో సుమారు 270 నుంచి 300 ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సంజీవరెడ్డిపాలెం నుంచి బూర్గంపహాడ్ మీదుగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వరకు 17 మీటర్ల ఎత్తుతో, 12 కిలోమీటర్ల పొడవున కరకట్ట నిర్మించనున్నారు. భూమి అడుగు భాగంలో సుమారు 180 మీటర్ల వెడల్పుతో, పైభాగంలో ఐదు మీటర్ల వెడల్పుతో ఈ రక్షణ గోడను నిర్మించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కరకట్ట నిర్మాణంతో పాటు మండలంలో వర్షపు నీరు గోదావరిలోకి వెళ్లేలా రెండు పంప్‌హౌస్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలోని పెదవాగు నుంచి ప్రారంభమయ్యే కరకట్ట, సంజీవరెడ్డిపాలెం సమీపంలోని దోమలవాగు వరకు నిర్మించనున్నారు. కరకట్ట నిర్మాణంతో సంజీవరెడ్డిపాలెం, బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాలతో పాటు మండల కేంద్రానికి గోదావరి, కిన్నెరసాని వరదల ముప్పు నుంచి రక్షణ లభించనుంది. ప్రతి ఏడాది వరదల కారణంగా పంటలు, ఇళ్లు ముంపునకు గురవడం, ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిపోవాల్సిన పరిస్థితికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. కరకట్ట నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం ఇప్పటికే భద్రాచలం సబ్‌కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు భూసేకరణ సర్వే పనులు ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలి దశలో 270 నుంచి 300 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో భూసేకరణకు పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## జాతీయ రహదారులపై తగ్గిన ప్రమాదాలు

### దాదాపు 4 శాతం తగ్గిందన్న కేంద్రమంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ,ఆగస్ట్5 : జాతీయ రహదారులపై ప్రమాదాల తగ్గినట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత నేషనల్ హైవేలపై మరణాల సంఖ్య దాదాపు 4 శాతం తగ్గిందని బుధవారం పార్లమెంటులో వెల్లడించారు. హైవేలపై యాక్సిడెంట్స్ లలో చనిపోయే వారి సంఖ్య 2025లో 62 వేల 122 కు తగ్గినట్లు చెప్పారు. 2024లో 64 వేల 772 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే.. 2023లో 63 వేల 112 మంది చనిపోయినట్లు తెలిపారు. ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతూ వస్తుండేదని.. కానీ కరోనా తర్వాత తొలిసారి 2025లో మృతుల సంఖ్య తగ్గినట్లు చెప్పారు. అదే సమయంలో 2025లో రోడ్డు యాక్సిడెంట్ల సంఖ్య 5.30 శాతం పెరిగినట్లు చెప్పారు. అంటే 5.13 లక్షల యాక్సిడెంట్స్ జరిగినట్లు చెప్పారు. సరాసరిగా గంటకు 21 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నేషనల్ హైవేస్ పై 2025లో లక్షా 43 వేల 526 ప్రమాదాలు జపగగా.. ఈ ఏడాది జులై 27 వరకు 77 వేల 234 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తమిళనాడులో ఎక్కువగా జరుగుతున్నట్లు గడ్కరీ చెప్పారు. 71 వేల 387 యాక్సిడెంట్స్ తో తమిళనాడులో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. అదేసమయంలో రోడ్డు ప్రమాద మృతులలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 2025లో ఆ రాష్ట్రంలో 27 వేల 550 మంది చనిపోయినట్లు గణాంకాలు పార్లమెంటుకు తెలిపారు.

## 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

### కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

### ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

### అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

### 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

### జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్,ఆగస్ట్5 : రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ÷-రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఎ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

## ఉదయనిధి బరితెగింపు విమర్శలు!

అధికారంలో ఉంటే పెసరం మాటలు..రెచ్చగొట్టే ప్రసంగాలు..సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచారని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయనపై డిఫమేషన్ కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశంలో,తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికి తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేడు. అందువల్ల డిఎంకె అధినేత స్టాలిన్‌ను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయం.

# మానవ తప్పిదాలతోనే ఈశాన్యం మునక



ఎగువ అసోంలో ఇటీవల సంభవించిన విధ్వంసకర ఆకస్మిక వరదలు అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి మరో నిదర్శనంగా నిలిచాయి. ఈ వరదలతో ఎగువ అసోం, దిగువ అసోం, మేఘాలయ మధ్య కీలక రవాణా మార్గాలు తెగిపోయాయి. ఈ వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నది, దాని ఉధృత ఉపనదులు గట్లను దాటి ప్రవహించడంతో ప్రధాన రహదారులు, వంతెనలు నీటమునిగాయి. గువాహటి వంటి ప్రధాన నగరాలు వరద ముప్పులో చిక్కుకున్నాయి. అయితే ఈ విపత్తును 'క్లౌడ్ బరస్ట్'గా అంటే అనివార్యమైన ప్రకృతి వైపరీత్యంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. కానీ ఈ విపత్తును కేవలం ప్రకృతి సృష్టించిన ప్రమాదంగా పేర్కొనడం అసలు కారణాలను కప్పిపుచ్చడమే అవుతోంది. భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందిన విధానాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలను క్రమంగా బలహీనపరచడం వంటి మానవ చర్యలే ఎగువ అసోంలో ఈ భారీ వరదలకు ప్రధాన కారణాలుగా మారాయి. శివసాగర్, చరైదేవో, జోర్హాట్ జిల్లాల్లో సంభవించిన తీవ్ర నష్టం కూడా ఈ విధానాల ఫలితమే. కొండలు, లోయలతో కూడిన అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థను సహజ సంపదగా కాకుండా వాణిజ్య లాభనష్టాల కోణం లో చూడటమే ఈ పరిస్థితికి దారితీసింది. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లలో నదులపై ఇప్పటికే వందకు పైగా జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా, మరెన్నో ప్రణాళిక దశలో ఉన్నాయి. ప్రధానికి అర్థం కాని జెన్‌జెడ్ ఆవేదన వర్షాకాలంలో జలాశయాలు నిండిపోతే, తమ కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను కాపాడుకునేందుకు ఎగువ ప్రాంతాల నిర్వాహకులు ఎలాంటి సమన్వయం లేకుండానే భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతమైన ఎగువ అసోం కృత్రిమ ఆకస్మిక వరదలకు నిలయంగా మారుతోంది. దీనికి తోడు నియంత్రణ లేకుండా సాగుతున్న బొగ్గు తవ్వకాలు, అక్రమంగా కొండలను తొలగించడం, భారీ స్థాయిలో రాతి క్వారీల నిర్వహణవల్ల లక్షల టన్నుల మట్టి నదుల్లోకి చేరుతోంది. దిఖౌ, దిసాంగ్, ఝాంజీ వంటి నదులు మట్టితో నిండిపోవడంతో వాటి నీటిని మోసుకెళ్లే సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా భారీ వర్షాలు కురిసిన వెంటనే ఈ నదులు గట్లను దాటి పరిసర ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం సృష్టించిన బీభత్సం మానవ, ఆర్థిక నష్టాల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎఎస్‌డిఎంఎ) గణాంకాల ప్రకారం, భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి విడుదలైన నీటి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 82 మంది ప్రాణాలు కోల్పోయారు. పది లక్షలకు పైగా ప్రజలు వరదలతో తీవ్రంగా ప్రభావితమయ్యారు. 21,523 హెక్టార్లకు పైగా నిలువ పంటలు నీటమునిగాయి. 11 వేలకుపైగా పశువులు, కోళ్లు మృతి చెందడంతో గ్రామీణ కుటుంబాలు తమ ప్రధాన జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం ఏమిటి? ఈ 'మానవ సృష్టి వరదల' వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవాలంటే ఈశాన్య భారతంలో గతంలో జరిగిన ఘటనలను పరిశీలిస్తే సరిపోతుంది. నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్ఇఇపిసిఒ) నిర్వహిస్తున్న 405 మెగావాట్ల రంగనది జలవిద్యుత్ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రంగనది జలాశయం నుంచి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే అదనపు నీటిని ఒక్కసారిగా విడుదల చేయడం వల్ల అసోంలోని లఖింపూర్, ధేమాజీ జిల్లాలు తరచూ వరదల బారిన పడుతున్నాయి. గ్రామాలు కొట్టుకుపోవడంతోపాటు సారవంతమైన వ్యవసాయ భూములు మందపాటి ఇసుక పొరలతో కప్పుకుపోయి సాగుకు పనికిరాకుండా మారుతున్నాయి. హిమాలయ ప్రాంత నదుల వ్యవస్థ ఎంత సున్నితమైనదో సిక్కింలోని చుంగ్‌థాంగ్ వద్ద తీస్తా 3 ఆనకట్ట కొట్టుకుపోయిన ఘటన మరోసారి చాటిచెప్పింది. హిమ సరస్సు విరిగిపోవడంతో ఏర్పడిన ఆకస్మిక వరద ధాటికి ఈ భారీ ఆనకట్ట క్షణాల్లోనే కొట్టుకుపోయింది. అనంతరం ఉధృతంగా వచ్చిన వరద నీరు సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లోని అనేక పట్టణాలను ముంచెత్తింది. డజన్ల కొద్దీ వంతెనలు ధ్వంసమయ్యాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎగువ ప్రాంతాల్లో చేపట్టే భారీ ప్రాజెక్టులు భౌగోళిక ప్రమాదాలను విస్మరిస్తే, దాని మూల్యం దిగువ ప్రాంతాల ప్రజలే ప్రాణాలతో, ఆస్తులతో చెల్లించాల్సి వస్తుందనే విషయాన్ని ఈ విపత్తు స్పష్టం చేసింది. అసోంలోని వరదలు, మహారాష్ట్రలోని భివండిలో భవనాలు కూలిపోవడం, ముంబైలో చెట్లు కూలి ప్రాణనష్టం సంభవించడం వంటి ఘటనలన్నింటికీ ఒకే తరహా పాలనా వైఫల్యం కనిపిస్తోంది. ప్రజల భద్రత కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఇటువంటి విపత్తులు చోటుచేసుకుంటున్నాయి. మరిన్ని కనుగొనండి తెలంగాణ సమాచారం చీమ్మం ఆధ్యాత్మిక కంటెంట్ గత పదేళ్లలో పర్యావరణ చట్టాలను పెద్ద వ్యాపార సంస్థలకు అనుకూలంగా మార్చడం ద్వారా కఠిన నియంత్రణ వ్యవస్థలను నామమాత్రంగా మార్చేశారు. ముఖ్యంగా పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నోటిఫికేషన్ వ్యవస్థను క్రమంగా బలహీనపరచడం వల్ల ప్రకృతి పరిరక్షణకు ఉన్న కీలక అడ్డుకట్టలు తొలగిపోయాయి. వివాదాస్పద సవరణల ద్వారా ప్రభుత్వం' ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్' (పనులు పూర్తయిన తర్వాత పర్యావరణ అనుమతి) విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

## అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

### ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు: ఉదయనిధి

చెన్నై,ఆగస్ట్5 : సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి. లాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉధయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## యాద్గిర్ జిల్లా రసాయన పరిశ్రమలో ప్రమాదం

### ముగ్గురు యువకుల దుర్మరణం
### ఒకరు నారాయణపేట జిల్లా వ్యక్తిగా గుర్తింపు

రాయచూర్,ఆగస్ట్5 : కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తెలంగాణ యువకుడు సహా ముగ్గురు యువకులు మరణించారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విషవాయువులు విడుదల కావడంతో బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని విషవాయువులు లీకవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషవాయువులు లీకవ్వడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవ్వడంతో వారిని రాయచూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే అప్పటికే ముగ్గురు మృతిచెందినట్లుగా వైద్యులు గుర్తించారు. మృతులను తెలంగాణలోని నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లికి చెందిన గణేశ్, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన విక్రమ్, సంజయ్‌లుగా గుర్తించారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్లలోపు వారేనని అధికారులు తెలిపారు. ఇక ఈ ఘటనలో ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన హేమంత్, శివకుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న యాద్గిర్ జిల్లా ఎస్పీ పృథ్విక్ శంకర్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై దర్యాప్తు చేపట్టారు.

## దుబాయ్‌లో పాతబస్తీ యువతి మిస్సింగ్

### శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు


హైదరాబాద్,ఆగస్ట్5 : దుబాయ్‌లో హైదరాబాద్ యువతి మిస్సింగ్ కలకలం రేపుతోంది. గత కొద్ది నెలలుగా ఆమె నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ కానీ.. సమాచారం కానీ లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని పోషించేందుకు వైద్య విద్య పూర్తి చేసిన ఓ యువతి (24) ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లింది. గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కు వెళ్లిన ఆమె అక్కడి ఓ ఆస్పత్రిలో విధుల్లో చేరింది. దుబాయ్ వెళ్లిన తర్వాత సదరు యువతి కొంతకాలం పాటు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేది. అయితే గత నాలుగు నెలలుగా ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదు. ఆమె రెండు ఫోన్లకు కాల్ చేసినా పనిచేయడం లేదు. దీంతో కంగారుపడిపోయిన కుటుంబసభ్యులు దుబాయ్‌లో ఉన్న తెలిసి వారి ద్వారా ఆరా తీశారు. అయినప్పటికీ యువతి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే యువతి కుటుంబసభ్యులు శంషాబాద్‌లోని ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రాహుల్ గురించి మాట్లాడే అర్హత లేదు

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై సంపత్ విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్5 : బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు.

## ధ్యానయోగం.. దైవమార్గం



ఆధ్యాత్మికం

ఆలోచనా ప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీద గానీ, ఒక భావం మీద గానీ,అవిచ్ఛిన్నమైన తైలధారగా స్థిరంగా ఉంచగలిగితే దానిని 'ధ్యానం' అంటారు.ధ్యానమంటే మనసు లోతును కొలిచే సాధనంగా నిర్వచిస్తారు తాత్త్వికులు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగిఉన్న శక్తిని పరిశీలించటమే ధ్యాన లక్ష్యం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనసును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్రమించే ఈ మనసు వెనుక ఉన్నది ఏమిటి? మనసును శోధించటం ద్వారా ఆలోచనలను పరిష్కరించటం, సమాధానపరచటం.. ఇదే ధ్యానం. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయిని అందుకున్నప్పుడు ఈ మనసు మనం అనుకున్నంత చెడ్డదేమీ కాదని అవగతమవుతుంది. ధ్యానం సిద్ధించినప్పుడు మనసు నుంచి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనసు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. 'ధ్యానం చేసేవారికి దేహాభిమానం తొలగుతుంది. భగవంతుని సాక్షాత్కారం కలుగుతుంది. ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు' అంటోంది వేదాంత పంచదశి. హృదయంలో బొటనవేలు పరిమాణంలో ఆత్మ ఉందని కఠోపనిషత్తు చెబుతుంది. నిరాకార నిర్గుణ పరమాత్మ ధ్యానం ఈ హృదయంలో చేయాలి. ఈ హృదయాకాశంలో జ్యోతిని పరమాత్మగానూ, ఆ జ్యోతి మధ్యలో ఉన్న చిన్న జ్యోతిని తన ఆత్మగానూ ధ్యానించాలని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. అలాంటి మహాత్ములు ఆత్మ, పరమాత్మలు ఒకటని చెప్పారు. అందుకే ఏకత్వాన్ని ధ్యానించాలి. హృదయాకాశంలో ద్వాదశ దళాల కమలంపై ఇష్టదేవత చిన్మయమూర్తి ఆసీనుడై ఉన్నట్లుగా భావించి ధ్యానించాలి.

# ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణ కల్పించాలి

**● జిల్లాలోని అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించాలి ● సమీకృత బాలల సంరక్షణ పథకం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణతో పాటు ప్రభుత్వ పరిరక్షణ సేవలు పూర్తిస్థాయిలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీకృత బాలల సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అలాగే దివ్యాంగులు, మానసిక వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ (సీసీఐ) హోమ్‌లలో ఉన్న పిల్లలకు అవసరమైన వసతులు, సంరక్షణ, భద్రత కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పిల్లలకు ఎక్కడ ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించేలా జిల్లాను మూడు విభాగాలుగా విభజించి పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువు మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకువచ్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన పిల్లలకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ , జువెనైల్ జస్టిస్ బోర్డు పరిధిలోని



కేసుల పురోగతి, బాలల గృహాల తనిఖీలు, ఫోస్టర్ కేర్, స్పాన్సర్‌షిప్ పథకాల అమలు, మిస్సింగ్/ఫౌండ్ చిల్డ్రన్ కేసులు, బాలల భద్రత చర్యలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఫీల్డ్ విజిట్లు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అన్ని ఆన్‌లైన్ యాప్‌లలో సమాచారాన్ని ప్రతిరోజూ నవీకరించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పెంచి ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో బాలల సంక్షేమ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతే సైబర్ మోసాలకు శాశ్వత నివారణ: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**● సింగరేణి హెచ్‌ఓడీ అధికారులతో సైబర్ క్రైమ్ విభాగం కీలక సదస్సు ● ఆన్‌లైన్ మోసాలు, ఏఐ డీప్‌ఫేక్ ప్రమాదాలపై సింగరేణి సిబ్బందికి అవగాహన**





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** సైబర్ భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యతే కాదని, సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. గోదావరిఖని ఇల్లందు క్లబ్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో సింగరేణి హెచ్‌ఓడీ అధికారులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు జరిపారు. "సురక్షా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ భేటీలో స్టాక్ మార్కెట్, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ, నకిలీ లింకులు, ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ నేరాల గురించి వివరంగా చర్చించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా పోస్టర్లను విడుదల చేసి, అధికారులతో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సీపీ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో అధికారులు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగులకు సైబర్ భద్రతపై తరచూ అవగాహన కల్పించాలని సూచించారు. ఇచ్చే ఐదు నిమిషాల అవగాహన కూడా ఎన్నో కుటుంబాలను ఆర్థిక నష్టాల నుండి కాపాడుతుందని తెలిపారు. అధిక లాభాల హామీలు, తెలియని యాప్‌లు, అనుమానాస్పద లింకుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. మోసానికి గురైన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే నేరగాళ్ల ఖాతాలు నిలిపివేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు, సంస్థలు, పోలీసు శాఖ పరస్పరం సహకరించుకుంటే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఎవరి ముఖచిత్రం, స్వరాన్నైనా పోలి ఉండేలా నకిలీ వీడియోలు, ఆడియోలు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బంధువులు, ఉన్నతాధికారుల పేరుతో సోషల్ మీడియా లేదా వాట్సాప్ ద్వారా అత్యవసరంగా డబ్బులు పంపాలని వచ్చే సందేశాలను వెంటనే నమ్మవద్దని, ముందుగా నిజానిజాలు సరిచూసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి ముందుగా అవగాహన పెంచుకుని తమ కింద పనిచేసే సిబ్బందికి చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, ఏసీపీలు రంగారెడ్డి, ఎం. రమేష్, సీఐలు ఆఫ్జల్, శ్రీనివాస్, రాణా ప్రతాప్, రాజేశ్వరరావు, ఎస్‌ఐలు మారుతి, క్రాంతి, సైబర్ క్రైమ్ సిబ్బంది, సింగరేణి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**● రూ.17,09,000 విలువైన 40.173 కిలోల గంజాయి ధ్వంసం ● మానకొండూర్ వెంకటరమణ ఇన్సినిరేటర్స్‌లో గంజాయి దహనం**





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 81 ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న 40.173 కిలోల ఎండు గంజాయితో పాటు 26గంజాయి మొక్కలను న్యాయస్థానం అనుమతితో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. న్యాయాధికారుల సమక్షంలో కేసు ప్రాపర్టీ నుండి ఎఫ్‌ఎస్‌ఎల్ పరీక్షల కోసం నమూనాలు సేకరించారు. అనంతరం కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలోని వెంకటరమణ ఇన్‌సినిరేటర్స్‌లో గంజాయిని దహనం చేశారు. ధ్వంసం చేసిన గంజాయి, మొక్కల మొత్తం విలువ సుమారు రూ.17,09,000 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. అక్రమ లాభాల కోసం గంజాయి సాగు, రవాణా, నిల్వ, విక్రయాలు జరుపుతూ యువతను బానిసలుగా మారుస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించామని హెచ్చరించారు. స్థానిక పోలీసులు, స్పెషల్ డ్రగ్ కంట్రోల్ టీమ్స్, నార్కోటిక్ విభాగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గంజాయి అక్రమ వ్యాపారం చేసే వారి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తు పదార్థాలు సేవించే వారిపైనా కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీలు ఎం.రమేష్, ఎ.వెంకటేశ్వర్లు,నాగేంద్రగౌడ్, సీఐ అనిల్, ఎస్‌ఐ వినీత పాల్గొన్నారు.

# పత్తి రైతులకు సస్యరక్షణపై అవగాహన శిక్షణ



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామంలో బుధవారం రోజున ఇండియా -- నవక్రాంతి ఎఫ్.పి.సి.ఎల్ ఆధ్వర్యంలో పత్తి రైతులకు పత్తి పంట సాగు, సస్యరక్షణపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ పద్ధతులు, భౌతిక నియంత్రణ చర్యలు, వివిధ రకాల కషాయాల తయారీ మరియు వాటి వినియోగం, పత్తిలో అంతర పంటల సాగు, నేలలో సేంద్రియ కర్బనం పెంపు వంటి అంశాలపై వివరంగా శిక్షణ అందించారు. తరువాత ఫీల్డ్ ఆఫీసర్ మానస మాట్లాడుతూ.. రైతులు రసాయన పురుగు మందుల వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించి, సేంద్రియ మరియు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట వ్యయాన్ని తగ్గించడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆషాడపు సాంబయ్య, నల్ల రాంరెడ్డి, ఇటికాల సాంబయ్య, కుశలయ్య, బండారి రాములు, వీరముష్టి రవీందర్, వీరముష్టి కుమారస్వామి, ఎనుమట్ల శ్రీకాంత్, ఇటికాల నాగరాజు, తిప్పారపు మల్లేష్, బుడిగె సమ్మయ్య తదితరులు,గూడెం గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అమ్మ దయ ప్రజలందరిపై ఉండాలి

**- చిట్కుల్‌లో ఘనంగా దుర్గమ్మ జాతర - పాల్గొన్న నాగర్‌కర్నూల్ జిల్లా జడ్జి శ్రీనిధి - ఫలారం బండి ఊరేగింపును ప్రారంభించిన నీలం మధు**



**సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్) పఠాన్ చేరు:** దుర్గమ్మ తల్లి ఆశీస్సులు, దయ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చిట్కుల్లో ప్రతి రెండు సంవత్సరాలకోసారి అత్యంత వైభవంగా నిర్వహించే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన బుధవారం శ్రీ దుర్గాదేవి ఆలయంలో పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక మొక్కుబడులు చెల్లించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకలకు చిట్కుల్ వాసి దశరథ్ దత్త సతీమణి నాగర్‌కర్నూల్ సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్, కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టు ఇన్చార్జ్ న్యాయమూర్తి శ్రీనిధి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్‌ఎం ఆర్ యువసేన సభ్యులు జడ్జి శ్రీనిధిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో బోనాల జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ఫలారం బండి ఊరేగింపులను ప్రారంభించిన నీలం, పురవీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం, భక్తుల జయ జయధ్వానాలు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, ప్రజలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఏఐఎఫ్ బీ పార్టీలో భారీగా చేరికలు....

**- వచ్చే ఎన్నికల్లో బీసీ ఎమ్మెల్యే గెలుపే లక్ష్యం - ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వచ్చే శాసనసభ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బహుజన రాజ్య స్థాపన కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని 25వ వార్డులో కుక్క చరణ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొలిపాక శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరడం ఆనందదాయకమని, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు బహుజన వర్గాల అభ్యున్నతే పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్, కుక్క కనకరాజు, మెహరాజ్, 25వ వార్డు సభ్యుడు మాచర్ల సాగర్, కుక్క అజయ్, కుక్క ఆదర్శ్, కుక్క శ్రావణ్, పేర్క నరేష్, చిలుక శశికుమార్, ఈర్ల గోపిచంద్, కుక్క రాజు, కుక్క దేవయ్య, కుక్క లక్ష్మయ్య, కుక్క రామస్వామి, ఈర్ల సాయి ప్రసన్న, రామగళ్ల ధనశ్రీ, కుక్క జీవన్, ఈర్ల నికిత, కుక్క సౌమ్య, చిలుక మల్లిక, ఎరుగురాల సుమలత, బొంకూరి నిర్మల, కుక్క విజయ, తుంగపిండి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నూతన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి: రాయి కంటి శ్రీనివాస్



**మానకొండూర్,ఆగస్టు5(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలకేంద్రంలో ఉపాధి హామీ ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేలా తెచ్చిన ఫోటో క్యాప్చర్ విధానంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా,ఐరిస్ తీసుకోకపోవడంతో పనికి వేతనాలు అందక సాంకేతిక సమస్యల మూలంగా కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త విధానం వల్ల ఉపాధి హామీ నిధులు కూడా తగ్గిపోతున్నాయని, గతంలో కేంద్రం 90% నిధులు ఇస్తుండగా ఇప్పుడు 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై 40శాతం భారం మోపుతుందన్నారు. ఇదిగ్రామీణ పేదల జీవనాధారానికి దెబ్బతిస్తే చర్యన్నారు. కనీస కూలి 600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రతి కూలికి 200 రోజులు పనులు కల్పించి పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలు వెంటనే విడుదల చేసి నూతన విధానాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాయికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**లక్షెట్టిపేట, ఆగస్టు 05, (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ శ్రీ ఎ.భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న సాధారణ పరిపాలనా విధులు, వివిధ రికార్డులు, నమోదవుతున్న కేసులు,వాటి దర్యాప్తు పురోగతి,నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను ఆయన సమీక్షించారు. లక్షెట్టిపేట మీదుగా జాతీయ రహదారి వెళ్లే నేపథ్యంలో తరచుగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో నమోదయ్యే సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులను చట్టబద్ధంగా, నిబంధనల మేరకు పరిష్కరించాలని తెలిపారు. భూ హక్కులకు సంబంధించిన వివాదాల్లో రెవెన్యూ శాఖ అధికారుల అభిప్రాయాన్ని తప్పనిసరిగా తీసుకున్న అనంతరమే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో అత్యంత సున్నితంగా స్పందించాలని, బాధితులకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించిన అనంతరం లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ అధికారులు సంతృప్తికరంగా విధులు నిర్వహిస్తున్నారని డీసీపీ ఎ.భాస్కర్ అభినందించారు.

# బిఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం



**మానకొండూర్, ఆగస్టు5(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 ప్రక్రియలో నమోదు చేసిన ఏఎస్డీ, రేషనలైజేషన్ పై ఈఆర్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్వైజర్లు, రాజకీయ ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... మరణించిన, నివాసం మార్చుకున్న, గైర్హాజరైన, డూప్లికేట్ మరియు సంతకం చేయడానికి నిరాకరించిన ఓటర్లు వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 85 ఏండ్లు పైబడిన ఓటర్ల వివరాలను బిఎల్‌ఓ ఆప్ ద్వారా తప్పనిసరిగా ధృవీకరించాలని, డిజిటలైజ్ చేసిన ఫోటోలు అప్‌లోడ్ అయ్యాయో లేదో రీ-వెరిఫై చేయాలని, నియోజకవర్గంలో రెండు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన రేషనలైజేషన్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. కుటుంబాలను విడగొట్టకుండా ఒక పోలింగ్ స్టేషన్ నుండి మరొక పోలింగ్ స్టేషన్‌కు ఓటర్ల మార్పిడి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. తహశీల్దార్లు విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఆర్‌ఓలు, బిల్‌ఓలు, వివిధ పార్టీల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

**● ఒక కోటి నలబై లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్)పటాన్ చేరు:** ముత్తంగి డివిజన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని నందన్ ప్యారడైజ్ కాలనీలో అరవై ఏడూ లక్షల యాభై వేల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్లు, ముత్తంగి డివిజన్ పరిధిలోని డిఎన్ కాలనీలో ముప్పై ఆరు లక్షల యాభై వేల రూపాయలతో చేపట్టనున్న పైపులైను నిర్మాణ పనులు, వెలిమల స్మశాన వాటికలో ముప్పై ఆరు లక్షల ఎనిమిది వేల రూపాయలతో చేపట్టనున్న రిటైనింగ్ వాల్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పటాన్ చేరు నియోజకవర్గంలోని ప్రతి కాలనీని అన్ని మౌలిక సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు గౌడ్, శ్రీకాంత్ గౌడ్, విజయ్ కుమార్, ఉపేందర్, దేవేందర్ యాదవ్, కొమరయ్య, శ్రీశైలం, ఉమేష్, నాగరాజు, రవీందర్ రెడ్డి, నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, ప్రభాకర్, మేరాజ్ ఖాన్ రామకృష్ణ వెంకటేష్, అశోక్, రాజ్ కుమార్, రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

# పులిమామిడిలో బాలుడుపై వీధి కుక్కల దాడి

**● తీవ్రంగా గాయపడటంతో నారాయణగూడ ఆస్పత్రికి తరలింపు ● బయట తిరగాలంటే భయంతో వణికిపోతున్న గ్రామస్తులు**





**కందుకూరు, ఆగస్టు 05, (ది క్రైమ్ న్యూస్):** గ్రామంలో వీది కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా మంగళవారం ఉదయం వీధి కుక్క దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో గ్రామానికి చెందిన బాలుడు స్కూల్ కు వెళ్లడానికి గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న రహదారిపై స్కూల్ బస్ కోసం వేచి చూస్తున్నాడు, ఈ క్రమంలో అక్కడే హఠాత్తుగా వచ్చిన వీది కుక్క బాలుడు పై విచక్షణ రహితంగా దాడి చేయడంతో కాలు పీక్కే బాగంతో పాటు చేతులకు తీవ్రంగా గాయమైంది, హుటాహుటిన కుటుంబ సభ్యులు బాలుడిని మహేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడినుండి మెరుగైన వైద్య నిమిత్తం నగరంలోని నారాయణగూడ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి తండ్రి లేకపోవడంతో తల్లి ఒకతే ఉండడంతో బాలుడు తండ్రిని తలుచుకొని బోరుణ వినిపించాడు. అమాయకులపై వీధి కుక్కలు దాడి చేస్తున్న క్రమంలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా ప్రజలు రోడ్లపై నడవాలన్నా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి తక్షణమే గ్రామంలో భారీగా పెరిగిన వీధి కుక్కలను గ్రామం నుండి తరలించాలని పంచాయతీ సిబ్బందిని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల సహకారంతో వీది కుక్కలను తరలిస్తాం



గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలను గుర్తించి సంబంధిత శాఖ అధికారుల సహకారంతో వాటిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతను కలిగించి వీది కుక్కలను నియంత్రించేం దుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

**పులిమామిడి గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్**

### వీధికుక్కలను ఊరినుండి తరిమేయాలి



చిన్నపిల్లల్ని వదిలి ఎక్కడికి వెళ్లాలన్నా భయాందోళనగా ఉంది పిల్లలు స్కూల్ నుండి వచ్చే క్రమంలో కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి, చాలా రోజులుగా గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలతో భయంగా ఉంది, గ్రామపంచాయతీ వారు స్పందించి వీధి కుక్కలను లేకుండా దూరంగా ఎలగొట్టాలి.

**పెద్దమోని రమేష్ పులిమామిడి వాస్తవ్యులు**

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్) పఠాన్ చేరు:** మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్ చేరు డివిజన్ మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్, బ్రాహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. పాఠశాల, కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. యువత దేశ భవిష్యత్తు మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, సామాజిక సంస్థలు, ప్రజలందరిపై ఉందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కూడా తీవ్రంగా దెబ్బతింటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం నేరాలు, హింస, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహిత ప్రాంతంగా మారాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, బాల్ రెడ్డి, నర్రా బిక్షపతి, అశోక్, హనుమంత్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 7న బెంగళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు బయలుదేరిన ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ నాయకులు మండల్ కమిషన్ ప్రధాన సిఫారసులన్నింటినీ అమలు చేయాలి

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**




**మిర్యాలగూడ (ది క్రైమ్ న్యూస్):** ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభకు ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి సుమారు వంద మంది బీసీ నాయకులు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. ఈ బస్సులను బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ, 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ లోక్‌సభలో బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో 27శాతం రిజర్వేషన్ల అమలును ప్రకటించిన చారిత్రక రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం ఆగస్టు 7ను మండల్ దినోత్సవం, సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలవుతుందని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీసీలను ఏకం చేసి వారి న్యాయమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. మండల్ కమిషన్ ప్రధాన సిఫారసులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, బంటు కవిత, తుపాకుల తుకారం, నక్క నాగరాజు, మునుగోడు నాయకులు మల్లికార్జున యాదవ్, సూర్యాపేట నాయకులు సంపత్‌నాయుడు, గజ్జల సత్యరాజు,సంధ్య,సునీత తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో ఈ-పెట్టీ కేసులపై కోర్టు తీర్పు

### ఇద్దరికి జైలు, సమాజ సేవ.. ఎనిమిది మందికి జరిమానా



**మేడ్చల్, ఆగష్టు 05(ది క్రైమ్ న్యూస్):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు ఈ–పెట్టీ కేసులకు సంబంధించి బుధవారం మొత్తం పది మంది నిందితులను పోలీసులు కుషాయిగూడ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసులను విచారించిన న్యాయస్థానం నిందితులపై వివిధ శిక్షలు విధించింది. మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన గాంధీనగర్, కాప్రాకు చెందిన నలుగూరి రమేష్‌పై సీపీ యాక్ట్ సెక్షన్ 70(బి) కింద రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. నార్త్ కమలనగర్, కుషాయిగూడకు చెందిన గుత్తికొండ రాజేష్‌పై నమోదైన కేసులో సీపీ యాక్ట్ సెక్షన్ 70(సి) కింద ఒక రోజు సమాజ సేవ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అదే విధంగా మిగిలిన ఎనిమిది మంది నిందితులకు సంబంధించిన ఈ–పెట్టీ కేసుల్లో ఆయా నిబంధనల ప్రకారం జరిమానాలు విధించింది. ప్రజలు చట్టాలను గౌరవించాలని, మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.

## కొలువుదీరిన ఊటూరు సొసైటీ నూతన పాలకవర్గం



**మానకొండూర్, ఆగస్టు5(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరులో ప్రాథమిక సహకార సంఘానికి బుధవారం ప్రమాణ స్వీకారంతో నూతన పాలకవర్గం కొలువుదీరింది. ముందుగా తీర్మాణాలపై సంతకాలు చేసిన అనంతరం సీఈఓ రవీందర్ రెడ్డి పాలకవర్గంతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా పలువురు నూతన పాలకవర్గ వర్గాన్ని పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపి రైతుల సంక్షేమం కోసం అంకిత భావంతో సేవలందించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు రొంటాల లక్ష్మారెడ్డి, కొత్త రాం రెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, తిమ్మాపూర్ మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, బెజ్జెంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పూట్కురి వెంకట రమణ రెడ్డి, సర్పంచ్లు ఎడ్ల సత్యనారాయణ, బుర్ర శ్రీదర్ గౌడ్, కొత్త రాం రెడ్డి, నాయకులు కనకం అశోక్, ముస్కు ఉపేందర్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి,బోళ్ళ మురళీధర్, వరహల చారి, గుడాల మహేందర్, ఇర్ఫాన్, చలిగంటి సంపత్, జీడీ శ్యాం సహకార సంఘ సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శ





**మహేశ్వరం ఆగస్టు 05, (ది క్రైమ్ న్యూస్):** కందుకూరు, మహేశ్వరం మండలాల పరిధిలోని రెండు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మృతిపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనరసింహారెడ్డి తండ్రి గంగాపురం యాదగిరి రెడ్డి,తో పాటు మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు నామని శివకుమార్ తల్లి నామని అండాలు, అనారోగ్యంతో మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న ఆమె బుధవారం మృతుల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేతో కలిసి మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్ మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ఇల్లంతకుంట, ఆగస్టు5 (ది క్రైం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లి అంగన్వాడి క్రేంద్రంలో సర్పంచ్ చల్లా నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.సూపర్వైజర్ చంద్రకళ మాట్లాడుతూ... శిశువు పుట్టిన ఆరునెలల వరక ముర్రు పాలే పట్టించాలని, ముర్రుపాలలో శిశువుకు అవసరమైన వ్యాధి నిరోధక శక్తిగా బిడ్డకు మొదటి టీకాగి పనిచేస్తుందన్నారు.డబ్బా పాలు ఇన్ఫెక్షన్లు రావడంమేకాక ఆర్థికంగా నష్టం జరుగుతుందని, ప్రతి ఒక్క తల్లి తన బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలు ఇచ్చి తర్వాత అనుబంధ పోషకాహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులుగర్భవతులు బాలింతలు తల్లులు ఆశా వర్కర్ టీచర్ ఆయా పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






**ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 05:** సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోనీ ఈ.వి.ఎం. గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసి గోడౌన్ రూం సీల్ ను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించి తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేసి భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా చేస్తున్న డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజు, డిటి అన్సారీ, ఆర్ అండ్ బి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# రాయదుర్గంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ..

## కాంగ్రెస్ నేతల నివాళి



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాయదుర్గం గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్, ఏఐసీసీ నాయకుడు మధుయాష్కి గౌడ్, మాజీ ఎంపీ బుర్ర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రజల స్వాభిమానం, ధైర్యం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీక అని కొనియాడారు. అధికారం కోసం కాకుండా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన మహానాయకుడిగా పాపన్న చరిత్రలో నిలిచిపోయారని, అన్యాయాన్ని ఎదుర్కొని సమానత్వం కోసం సాగించిన ఆయన పోరాటం ప్రతి తెలంగాణ బిడ్డకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చరిత్రను గౌరవిస్తూ మరుగున పడిన మహనీయులకు తగిన గుర్తింపు కల్పించే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహనీయుల జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం, వారి చరిత్రను భావితరాలకు చేరవేయడం, ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని, ఇదే స్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటంలో కూడా కనిపిస్తుందని అన్నారు. ఆయన ఆశయాలు నేటి తెలంగాణ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం కేవలం ఒక శిల్పం కాదని, అది ధైర్యానికి ప్రతీక, స్వాభిమానానికి చిరునామా, సామాజిక న్యాయానికి చిహ్నమని జగదీశ్వర్ గౌడ్ అన్నారు. భావితరాలు పాపన్న చరిత్రను తెలుసుకుని సమాజ సేవకు అంకితమయ్యే నాయకత్వాన్ని అలవరచుకోవాలని, ఆయన ఆశయాలను ఆచరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను మరింత అభివృద్ధి, సమానత్వం, సామాజిక న్యాయం వైపు తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల సంజీవ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాములు గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, భరత్‌గౌడ్, వెంకటేష్ గౌడ్, కనకమామిడి నరేందర్ గౌడ్, సురేష్ గౌడ్, చిన్న గౌడ్, వీరేందర్ గౌడ్, రోహిత్ గౌడ్, శ్రీకాంత్ ముదిరాజ్, మల్లికార్జున్ యాదవ్, అనిల్ గౌడ్, ఏకాంత్ గౌడ్, పుట్ట వినయ్ కుమార్ గౌడ్, అశోక్ యాదవ్, కృష్ణ యాదవ్, గౌడ్ సంఘం రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో గల తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ తమ్మిడి కుంట చెరువు సుందరీకరణ మరియు అభివృద్ధి పనులలో వేగం పెంచాలని, త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుంది అని కావున పనులలో వేగం పెంచాలని ప్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. చెరువు దశ దిశ మారినది అని, చెరువు ఆక్రమణలను తొలగించి చెరువును పూర్వ వైభవానికి తెచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగినది అని, చెరువు పరిధిలో జరిగిన కబ్జాలు, నిర్మాణాలను తొలగించి పూర్తి స్థాయిలో రక్షణ చర్యలు చేపట్టడం జరిగినది అని, కుంచించుకుపోయిన చెరువు విస్తీర్ణాన్ని కాపాడి, నాలాల పునరుద్ధరణ మరియు సుందరీకరణ పనులను వేగవంతం చేయడం జరిగినది అని ప్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. త్వరలోనే చెరువు ను అన్ని హంగులతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చైర్మన్ గాంధీ తెలియచేశారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, చెరువు చుట్టూ డ్రైనేజీ పైప్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని , న్యూ నీ నిర్మిస్తామని, ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన. ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని, చెరువు సుందరీ కరణ మరియు అభివృద్ధి పనుల పై అధికారులకు పలు సలహాలు ,సూచనలు ఇవ్వడం జరిగినది అని చైర్మన్ గాంధీ తెలియచేశారు. అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం ,పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని ప్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేసారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అని ,చెరువు సుందరికరణ మరియు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు అదేవిధంగా ప్రణాళిక తో పనులు చేపట్టాలని చైర్మన్ గాంధీ తెలియచేసారు .అదేవిధంగా చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని ప్రాజ చైర్మన్ గాంధీ గారు అన్నారు. అదేవిధంగా తమ్మిడి కుంట చెరువు ను సుందరవనంగా, శోభితవర్ణంగా తీర్చిదిద్దుతామని, అదేవిదంగా చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువు ల ను సంరక్షిస్తామని ప్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేసారు. చెరువుల మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది . ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పడం జరిగినది, తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని ప్రాజ చైర్మన్ గాంధీ గారు చెప్పటం జరిగినది .చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామని, చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి ,ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గంలోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చైర్మన్ గాంధీ చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు , నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జంగయ్య యాదవ్, రామచందర్, సర్వర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఐకియా జంక్షన్, ఐటీసీ ఫ్రీ లెఫ్ట్‌ను పరిశీలించిన సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ బుధవారం ఐకియా జంక్షన్‌ను సందర్శించి పాదచారుల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్రోతో పాటు ఇతర ప్రజా రవాణా మార్గాల ద్వారా వచ్చే పలువురు పాదచారులు జీబ్రా క్రాసింగ్‌లు, నిర్దేశిత మార్గాలను వినియోగించకుండా నేరుగా రహదారిని దాటుతున్నట్లు గుర్తించారు. పాదచారుల భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జీబ్రా క్రాసింగ్‌లు, నిర్దేశిత పాదచారుల మార్గాల ద్వారానే రహదారిని దాటేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన చోట్ల నిబంధనల అమలును మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. అనంతరం ఐటీసీ ఫ్రీ లెఫ్ట్‌ను పరిశీలించిన జాయింట్ కమిషనర్, అక్కడి ట్రాఫిక్ ప్రవాహం, రహదారి మౌలిక సదుపాయాల పనితీరును సమీక్షించారు. వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగేందుకు అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పరిశీలన సందర్భంగా రహదారి పక్కన అనుమతి లేకుండా క్యాబ్‌లు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నట్లు గుర్తించిన ఆయన, అక్రమంగా నిలిపిన వాహనాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇలాంటి అక్రమ పార్కింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రజా రహదారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు సూచించారు. ట్రాఫిక్ ఇంజినీరింగ్, నిబంధనల అమలు, ప్రజల్లో అవగాహన కల్పించడం అనే మూడు అంశాలు సమన్వయంతో పనిచేస్తేనే రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు పాదచారుల క్రమశిక్షణ పెరిగి, ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన రవాణా వాతావరణం కల్పించవచ్చని జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు.

## కొరియర్ సిబ్బంది ముసుగులో దోపిడీ..

### మిరియాల స్ప్రేతో మహిళపై దాడి చేసిన నిందితుడు అరెస్ట్

**మియాపూర్ పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన.. నాలుగు తులాల బంగారు మంగళసూత్రం స్వాధీనం**




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కొరియర్ డెలివరీ సిబ్బంది ముసుగులో ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న మహిళపై మిరియాల స్ప్రే చల్లి నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన నిందితుడిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. సీసీ కెమెరా దృశ్యాలు, సాంకేతిక, శాస్త్రీయ ఆధారాల సహాయంతో కేసును ఛేదించిన పోలీసులు అపహరించిన బంగారు మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం జూలై 31న బి. అధినారాయణ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయుర్వేద మందులు తీసుకొచ్చిన కొరియర్ సిబ్బందినని చెప్పి ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో ఫిర్యాదుదారుడి భార్య ఒక్కరే ఉన్నారని నిర్ధారించుకున్న అనంతరం ఆమె ముఖంపై మిరియాల స్ప్రే చల్లి, మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, సీసీ కెమెరా దృశ్యాలు, సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను విశ్లేషించి నిందితుడిని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన షేక్ ఖాజా అర్షల్ (20)గా గుర్తించారు. అనంతరం ప్రత్యేక పోలీసు బృందం కనిగిరికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి నాలుగు తులాల బంగారు మంగళసూత్రంతో పాటు నేరానికి ఉపయోగించిన ఆయుర్వేద మందుల ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకుంది. విచారణలో నిందితుడిపై గతంలో కూడా చోరీ, దొంగతనాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని కొరియర్ డెలివరీ సిబ్బంది ముసుగులో ఇళ్లలోకి ప్రవేశించడం, మిరియాల స్ప్రేతో దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరించడం అతడి నేర పద్ధతిగా గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తింపు తెలియని వ్యక్తులను ఇంట్లోకి అనుమతించే ముందు వారి వివరాలను నిర్ధారించుకోవాలని మియాపూర్ పోలీసులు సూచించారు.

## మాదాపూర్‌లో అక్రమ ట్రామడాల్ మాత్రల విక్రయంపై పోలీసుల దాడి 6,568 మాత్రలు స్వాధీనం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మాదాపూర్ పోలీసులు విశ్వసనీయ సమాచారం ఆధారంగా బుధవారం అయ్యప్ప సొసైటీ, సాయినగర్‌లోని ప్రైమ్ ఫార్మసీపై దాడి నిర్వహించి, వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్‌లు లేకుండా అక్రమంగా ట్రామడాల్ హైడ్రోక్లోరైడ్ 50 మిల్లీగ్రాముల మాత్రలను విక్రయిస్తున్న వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ కేసులో ప్రైమ్ ఫార్మసీ యజమాని, ఫార్మసిస్ట్ తొర్రి వెంకటేశం (32), డెలివరీ బాయ్ బర్లకడి శ్రీకాంత్ (32)లను పోలీసులు అరెస్టు చేశారు. దాడిలో 821 స్ట్రిప్‌లు (మొత్తం 6,568 మాత్రలు) స్వాధీనం చేసుకున్నారు. వీటిలో సుమారు 328.4 గ్రాముల ట్రామడాల్ హైడ్రోక్లోరైడ్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు తొర్రి వెంకటేశం నారాయణఖేడ్‌కు చెందిన పరారీలో ఉన్న రాథోడ్ ప్రకాశ్ నుంచి అక్రమంగా ఈ మాత్రలను తెప్పించి, వైద్యుల ప్రిస్క్రిప్షన్‌లు లేకుండానే ఫార్మసీ ద్వారా, అలాగే డెలివరీ బాయ్ ద్వారా వినియోగదారులకు విక్రయించినట్లు వెల్లడైంది. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలో జరిగినట్లు గుర్తించారు. గత కొన్ని నెలలుగా సుమారు 100 నుంచి 150 మంది వినియోగదారులకు ఈ మత్తు ప్రభావం కలిగిన మాత్రలను సరఫరా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో సరఫరా గొలుసు, కొనుగోలుదారుల వివరాలు, డిజిటల్, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోందని, పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండా సైకోట్రోపిక్ ఔషధాలను విక్రయించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని మాదాపూర్ పోలీసులు హెచ్చరించారు. అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

## క్రీడలు నిత్యజీవితంలో భాగం కావాలి

**- ఆరిజిన్ పాఠశాల వేదికగా సౌత్ జోన్--1 తైక్వాండో పోటీలు - ఐదు రాష్ట్రాల నుండి మూడు వేల మంది క్రీడాకారుల హాజరు - ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్):** క్రీడలు ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని ఆరిజిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీబీఎస్ఈ పాఠశాలల సౌత్ జోన్--1తైక్వాండో పోటీలను ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పటాన్ చేరు నియోజకవర్గంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన క్రీడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పటాన్ చేరు మైత్రి మైదానం వేదికగా ఏడాది పొడవునా వివిధ క్రీడా అంశాలలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు తమ ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పటాన్ చేరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పోటీలలో పాల్గొనడం పట్ల అభినందనలు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల క్రీడలకు వేదికగా నిలిచిన ఆరిజిన్ పాఠశాల యాజమాన్యాన్ని అభినం దించారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ అబ్జర్వర్ దురై, ఆల్ఫా స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్లు వెంకటేష్, రాంబాబు,ఆరిజిన్ పాఠశాల చైర్మన్‌ప్రమోద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ అవార్డు అందుకున్న రిపోర్టర్ వడ్లూరి రవీందర్




**ధర్మపురి, ఆగష్టు 5, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం టీవీ 5న్యూస్ చానల్ రిపోర్టర్ వడ్లూరి రవీందర్ జాతీయ ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ అవార్డును అందుకున్నారు. బుధవారం కర్ణాటక మీడియా అకాడమీ బెంగుళూరు మరియు సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోకస్ ఆన్ న్యూస్ 2.0 నేషనల్ న్యూస్ ఫోటో జర్నలిస్ట్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్స్ కు రవీందర్ పంపించిన అరుదైన వుడెన్ ట్రైప్ బట్టర్ ప్లై ఫోటో ఉత్తమ ఫోటో గా ఎంపికైన సందర్భంగా మంగళ వారం బెంగుళూరు లోని చిత్ర కళా పరిషత్ లో జరిగిన ఫోటో జర్నలిస్ట్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర మేజర్ అండ్ మీడియం ఇరిగేషన్ శాఖ మంత్రి రామలింగారెడ్డి, డాక్టర్ బి.ఆర్. మమత కర్ణాటక సమాచార శాఖ కమిషనర్, మీడియా అకాడమీ చైర్ పర్సన్ ఆయేషా కానం రవీందర్ కు మేమెంటో సర్టిఫికెట్ ప్రధానం చేసి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. గతంలో రవీందర్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో పలు రాష్ట్ర స్థాయి ఫోటో గ్రాఫీ పోటీల్లో పాల్గొని అవార్డులు అందుకున్నారు. ఇలా అవార్డులు కైవసం చేసుకుంటున్న రిపోర్టర్ రవీందర్ ను స్నేహితులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సింగరేణి ఏరియా హాస్పిటల్ అడిషనల్ సీఎంవోకు ఘన సత్కారం

**డాక్టర్ ప్రసన్న కుమార్ సేవలను కొనియాడిన ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు**



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** సింగరేణి ఏరియా హాస్పిటల్ నూతన అడిషనల్ సీఎంవోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ప్రసన్న కుమార్‌కు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వైద్య రంగంలో డాక్టర్ ప్రసన్న కుమార్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించాలని కోరుతూ శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపేందర్, జిల్లా ఎస్సీ--ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాంపెల్లి సతీష్, ఏఐటీయూసీ నాయకులు నరహరిరావు, గడమల రాకేష్, రామంచ తిరుపతి, ఎలమర్తి శిరీష్, ఆకునూరి బాలంకూస్, ఇరువురాల కృష్ణయ్యతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ ప్రసన్న కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

# భూ రీ - సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## ● జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్





**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 05**: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను పూర్తిగా పరిష్కరించి శాశ్వతమైన, పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ రీ-సర్వే పై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పాల్గొని రైతులకు, గ్రామ ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజలు భూ సర్వే పై అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామంలో ముందుగా రెవెన్యూ గ్రామ సరిహద్దులను పూర్తిగా ఖరారు చేస్తున్నామని, అనంతరం ప్రభుత్వ భూములు, భూసేకరణ జరిగిన ప్రాంతాలు, ఇతర ప్రత్యేక భూములను గుర్తించి వేరు చేస్తున్నామని వివరించారు. తరువాత మాత్రమే వ్యవసాయ భూములు, రైతుల వ్యక్తిగత భూములను క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో కొలిచి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, ఆన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని తెలిపారు. కొంతమందికి తక్కువ విస్తీర్ణం నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని చెప్పారు. గ్రామంలోనీ ప్రతి రైతుకు 48గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని విశ్వసించి భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కాకరవాయి, బేతుపల్లి గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించిన సందర్భం గుర్తుచేస్తూ, అందుకే ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి 60 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. ఆనతరం నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీఓ భవనం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నేలకొండపల్లి తహసీల్దారు రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

## ● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 05**: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయని, పోలింగ్ స్టేషన్ వారీగా డిజిటలైజేషన్ నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక పరిశీలనలో జిల్లాలో 95,740 మంది ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు, 33,134 మంది మరణించినట్లు గుర్తించామని తెలిపారు. 42,814 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కాలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని తెలిపారు. ఆగస్టు 10, 2026 నాటికి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 19 క్రొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ స్టేషన్లను వీలైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు,జి.సూర్య నారాయణ, బీ.ఆర్.ఎస్. ప్రతినిధులు ఎం.రమేష్, బి వేణుగోపాల్, సిపిఎం డి.తిరుపతి రావు, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, ఆప్, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసీ డిస్ఇన్వెస్ట్‌మెంట్‌కు వ్యతిరేకంగా ఉద్యోగుల ఆందోళన

● ప్రజా రంగ సంస్థను బలహీనపరిచే ప్రయత్నాలు మానుకోవాలి ● ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం. ప్రేమ్ కుమార్



**హుజూరాబాద్, ఆగస్టు 5 (ది క్రైమ్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వాటాలను విక్రయిస్తూ డిస్ఇన్వెస్ట్‌మెంట్ విధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఐక్యంగా నిరసన వ్యక్తం చేస్తూ, ఎల్ఐసీని ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే చర్యలను వెంటనే విరమించు కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి ఎం. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో కోట్లాది మంది ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ అని, ప్రజల పొదుపులను భద్రంగా కాపాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అలాంటి సంస్థలో ప్రభుత్వ వాటాలను తగ్గించడం ద్వారా సంస్థ స్వతంత్రత దెబ్బతింటుందని, భవిష్యత్తులో పాలసీదారుల ప్రయోజనాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డిస్ఇన్వెస్ట్‌మెంట్ విధానం కొనసాగితే ఎల్ఐసీ ప్రజా సేవా లక్ష్యం దెబ్బతినడంతో పాటు, గ్రామీణ ప్రాంతాలు, సామాన్య ప్రజలకు అందుతున్న సేవలు కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందన్నారు. దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఎల్ఐసీని బలోపేతం చేయాల్సింది పోయి బలహీనపరిచే చర్యలు చేపట్టడం సమంజసం కాదన్నారు. యూనియన్ అధ్యక్షుడు జి. రుషిత్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్ఐసీ ఉద్యోగులు, పాలసీదారుల హక్కులను పరిరక్షించేందుకు పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజారంగ సంస్థలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, డిస్ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. జాయింట్ సెక్రటరీ-1 బి. రవి కుమార్, జాయింట్ సెక్రటరీ-2 ఏ. చందర్, కోశాధికారి ఆర్. కుమారస్వామి మాట్లాడుతూ, ఎల్ఐసీని ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ఎలాంటి చర్యనైనా ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు. సంస్థ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే నిర్ణయాలను విరమించు కోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ట్రాఫిక్ నిబంధనల అమలులో రాజీ పడేది లేదు

● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ట్రాఫిక్ నిబంధనల అమలులో రాజీ పడేది లేదు అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రవాణా శాఖ (ఆర్టీఏ), లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోలీస్ కమిషనర్, ఇసుక, బొగ్గు, యాష్ తదితర లోడ్లను తరలించే వాహనాలు తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లతో కప్పాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహన యజమానులు, డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రయాణికులు, పాఠశాల మరియు కళాశాల విద్యార్థులను ఆటోలు, ఇతర రవాణా వాహనాల్లో పరిమితికి మించి ఎక్కించవద్దని పేర్కొన్నారు. ఉల్లంఘనలకు పాల్పడే వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, నంబర్ ప్లేట్ లేకపోవడం, మైనర్ల డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రమాద బాధితులను కాపాడే రహ-వీర్ పథకం, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై వాహనదారులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా శాఖలతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీటీఓ గోపీకృష్ణ, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హసన్, మంచిర్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, రామగుండం, పెద్దపల్లి, మంచిర్యాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# మంద సత్యానందంకు విజన్ ఆంధ్ర ఘన నివాళి

**జక్కుల నరేందర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు పరామర్శ**

**దహన సంస్కారాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం**

**బాధిత కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని హామీ**





**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 05:** బోనకల్‌లో ఆగస్టు 4 విజన్ ఆంధ్ర బోనకల్ మండలం ఎల్.గోవిందాపురం గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర కుటుంబ సభ్యుడు మంద సత్యానందం సోమవారం రాత్రి బోనకల్ ఫ్లైఓవర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాదకర ఘటన విషయం తెలుసుకున్న విజన్ ఆంధ్ర వ్యవస్థాపకులు జక్కుల నరేందర్ ఆంధ్ర - తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా బ్యూరో ఇన్‌చార్జి పర్చగాని రామకృష్ణ మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విజన్ ఆంధ్ర కుటుంబం తరపున మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ దహన సంస్కారాల నిర్వహణ కోసం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంద సత్యానందం సేవలను స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అలాగే భవిష్యత్తులో సంస్థ తరపున అవకాశం ఉన్న మేరకు కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఖమ్మం జిల్లా బ్యూరో ఇన్‌చార్జి పర్చగాని రామకృష్ణ హామీ ఇచ్చారు. విజన్ ఆంధ్ర కుటుంబ సభ్యుల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## పోచమ్మ బోనాల వేడుకలో పాల్గొన్న నల్లగొండ తిరుపతి గౌడ్



**మానకొండూర్, ఆగస్టు5 (ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపలక్కలకు చెందిన గౌడ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకలలో పాల్గొన్నారు.స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్లమ్మ తల్లి పట్నాల వేడుకలు పోచమ్మ బోనాలతో ప్రారంభం కాగా తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గౌడ మహిళలు ఇంటి నుండి బోనం కుండ నెత్తిన పెట్టుకుని శివసత్తుల పూనకాలు,డప్పు చప్పుళ్ళతో పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.గౌడ సంఘ సభ్యుదు, గ్రామస్తులు బోనాల వేడుకలలో పాల్గొన్నారు.

# జమ్మికుంట డిగ్రీ కాలేజీలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

## కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్






**జమ్మికుంట ఆగస్టు 5 (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులు ఇష్టపడి బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో మంచి ప్రయోజకులుగా ఎదగాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్ అన్నారు. బుధవారం కళాశాలలో సురక్ష మల్టీస్పెషాలిటీ హస్పిటల్స్ యాజమాన్యం డా.కె. తిరుపతి, డా. కె. స్వర్ణలత ల సహకారంతో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఈ మధ్యాహ్న భోజన పథకం వరుసగా మూడవ సంవత్సరం కొనసాగించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గత రెండు సంవత్సరాలలో బచ్చు భాస్కర్, శ్రీరామా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం డా.రాము, డా. శ్రీవాణి, డా. శ్రీనివాస్, డా. రాణి లు సహకారం అందించారని, వారికి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా క్లాసులలో హాజరు శాతం పెరిగిందనీ, అడ్మీషన్లు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్ . ఓదెలు కుమార్, అకడమిక్ కో- ఆర్డినేటర్ డా. కె. రాజేంద్రం డా.కె. గణేష్, డా. శామల, డా. కె. మాధవి, కె.ఉమాకిరణ్, వి. కిరణ్ కుమార్, ఎన్. మమత, పి.శ్రీనివాస్ రెడ్డి, ఎల్. రవిందర్, డా.పి. సుష్మ, డా.పి. రవిప్రకాశ్ రావు, డా. ఎన్.శ్రీనివాస్, ప్రశాంత్, రమేష్, శ్రీకాంత్, సాయికుమార్, అరుణ్ రాజ్, అనూష, డా.పి.స్వప్న, దీనా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# 2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

స్పోర్ట్స్

## ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు మ్యాచ్‌లు




వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లను ఏ దేశంలో లేదా ఏ వేదికల్లో నిర్వహిస్తారనే దానిపై ఐసీసీ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్‌లో గెలిచిన టాప్ టీమ్ నేరుగా ఈ 14 జట్ల ప్రధాన గ్రూప్‌లో చోటు దక్కించుకుంటుంది. ఇక క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్-12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాల ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు కలిసి ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. టోర్నీలోని మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా 8 వేదికలు సౌతాఫ్రికాలోనే ఉన్నాయి. మిగిలిన వాటిలో 3 వేదికలు జింబాబ్వేలో, 1 వేదిక నమీబియాలో ఉన్నాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్-4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్?లో టాప్-4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్ లో తలపడతాయి. త 2023 వన్డే ప్రపంచకప్‌లో క్వాలిఫైయర్ రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన మాజీ ఛాంపియన్ వెస్టిండీస్‌కు మళ్లీ అలాంటి పరిస్థితే ఎదురయ్యేలా కనిపిస్తోంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో విండీస్ 10వ స్థానంలో ఉంది. సెప్టెంబర్ 30 కట్-ఆఫ్ తేదీకి ముందు కరేబియన్ జట్టు కేవలం 2 వన్డేలు మాత్రమే ఆడనుంది (అవి భారత్‌తో జరగనున్నాయి). అటు అఫ్గానిస్థాన్, ఐర్లాండ్ మధ్య జరిగే వన్డే సిరీస్ ఫలితాలు కూడా వెస్టిండీస్ భవిష్యత్తును శాసిస్తాయి. ఐర్లాండ్ 4-1 లేదా 5-0 తో గెలిచి, వెస్టిండీస్ భారత్‌పై రెండు వన్డేల్లోనూ విజయం సాధిస్తేనే కరేబియన్ జట్టు నేరుగా టాప్-8 కి చేరుకునే అవకాశం ఉంటుంది.



# రోహిత్ తనంతట తాను వైదొలిగే ప్రసక్తే లేదు

**రోహిత్ శర్మ రిటైర్మెంట్ పై మహమ్మద్ కైఫ్ వ్యాఖ్యలు**

భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ అంశంపై టీమిండియా మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ తనంతట తానుగా క్రికెట్ నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని, ఒకవేళ అతన్ని తొలగించాలనుకుంటే సెలెక్టర్లే ఆ పని చేయాలని నేరుగా సవాలు విసిరాడు. 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే దానిపై బోర్డు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై కైఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల వేదికగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ప్రశ్న అభిమానులతో పాటు విశ్లేషకులను కూడా వేధిస్తోంది. జులై 19న ఆడే మ్యాచే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ అంటూ వచ్చిన వార్తలను బిసిసిఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా ఖండించినప్పటికీ, రోహిత్ భవిష్యత్తుపై మాత్రం మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి అధికారిక హామీ లభించలేదు. దీనిపై కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ "రోహిత్‌కు నచ్చినట్లు ఆడే స్వేచ్ఛ ఇచ్చామని చెబుతున్న కోచ్‌లు, అతను 2027 వరల్డ్ కప్ ప్లాన్స్‌లో ఉన్నాడో లేదో స్పష్టంగా ఎందుకు చెప్పడం లేదు?" అని నిలదీశాడు. గతంలో లార్డ్స్ మైదానంలో జులై 19న జరిగే వన్డేనే రోహిత్‌కు చివరిదని ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలను బీసీసీఐ ఖండించడమే కాకుండా, ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ కేవలం 84 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 138 పరుగులతో విరవిరుచుకుపడ్డాడు. ఇది అతనికి వన్డేల్లో 34వ సెంచరీ కాగా, 2026 సంవత్సరంలో తొలి సెంచరీ. భారత్ ఆ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ రోహిత్ బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు. బోర్డు జోక్యం చేసుకోవడం, రోహిత్ సెంచరీ బాదడం వల్ల ఆ సమయంలో పెద్ద వివాదం తప్పిందని కైఫ్ పేర్కొన్నాడు. జట్టు మేనేజ్‌మెంట్, బీసీసీఐ పబ్లిక్‌గా సరైన ప్రకటన చేయకపోవడం వల్లే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాడి ఫామ్‌లో హెచ్చుతగ్గులు సహజమని, బోర్డు రోహిత్‌కు పూర్తి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందన్నాడు. బయట ఉన్నవారికి లోపల ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోయినా, రోహిత్ శర్మ మాత్రం తనను ఎవరూ తప్పించలేరని, ఒకవేళ వెళ్లాలనుకుంటే ఆ నిర్ణయం తన చేతుల్లోనే ఉంచుకోవాలని భావిస్తున్నాడని కైఫ్ స్పష్టం చేశాడు. రోహిత్ శర్మను వన్డే జట్టులో కొనసాగించాలా వద్దా అనే విషయమై సెలెక్టర్ల మధ్య కూడా లోపల మంతనాలు జరుగుతున్నాయని, ఇంకా ఎలాంటి ఆఖరి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. రాబోయే పర్యటనలు, సిరీస్‌ల ఆధారంగా బీసీసీఐ రోహిత్ శర్మ విషయంలో ఒక స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.



# స్పిన్‌తో కుస్తీ

## రాహుల్, జైస్వాల్ ప్రత్యేక శ్రద్ధ లంక చేరుకున్న టీమిండియా

ముంబై: శ్రీలంక పర్యటనకు బయల్దేరేముందు భారత టెస్టు ఓపెనర్లు కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ స్పిన్‌తో కుస్తీలు పట్టారు. ఆది, సోమవారాల్లో ఈ ఇద్దరూ ముంబై బాంద్రాలోని ఓ స్పోర్ట్స్ సెంటర్‌లో స్పిన్‌ను మెరుగ్గా ఆడేందుకు తీవ్రంగా శ్రమించారు. లంకతో సిరీస్‌కు జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ముంబై స్పిన్నర్ తనుష్ కొటియాన్‌తో పాటు మరికొంతమంది లోకల్ స్పిన్నర్లతో ఓపెనింగ్ ద్వయం నెట్స్‌లో చెమటోడ్చింది. గతంలో స్పిన్‌ను అలవోకగా ఎదుర్కొనే భారత బ్యాటర్లు.. గడిచిన రెండేండ్లుగా స్వదేశంలో ప్రత్యర్థుల స్పిన్ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతూ తీవ్ర విమర్శల పాలవుతున్న విషయం తెలిసిందే. రాబోయే లంక సిరీస్ సైతం టీమిండియాకు కఠిన సవాలే. ఆ జట్టులో ప్రభాత్ జయసూర్య తన స్పిన్ మాయాజాలంతో ముప్పుతిప్పలు పెట్టగల సమర్థుడు. దీంతో భారత ఓపెనర్లు అతడిని నిలువరించేందుకు ప్రత్యేకంగా స్పిన్‌పైనే ఫోకస్ పెట్టారు. నెట్ బౌలర్లుగా నలుగురు స్పిన్నర్లు.. లంకతో సిరీస్‌లో స్పిన్‌ను మెరుగ్గా ఎదుర్కొనేందుకు గాను బీసీసీఐ.. జట్టుతో పాటు నలుగురు స్పెషలిస్ట్ స్పిన్నర్లను ఎంపికచేసింది. కొటియాన్ (ఆఫ్ స్పిన్), విప్రాజ్ నిగమ్ (లెగ్ స్పిన్), శివాంగ్ కుమార్ (లెఫ్టార్మ్ రిస్ట్ స్పిన్), హర్ష్ దూబే (లెఫ్టార్మ్ ఆర్థోడాక్స్).. నెట్స్‌లో గిల్ సేనకు పరీక్ష పెట్టనున్నారు. ఇప్పటికే జట్టులో రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ ఉండగా ఈ నలుగురినీ నెట్ బౌలర్లుగా పంపించడం గమనార్హం. ఇదిలాఉండగా మంగళవారం సాయంత్రం భారత జట్టు కొలంబోలో దిగింది. లంకతో టెస్టు సిరీస్ ఈనెల 15 నుంచి మొదలుకానుంది






# చరిత్ర సృష్టించిన పాక్ ఆటగాడు అబ్దుల్లా షఫీక్

క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు అత్యంత బలమైన స్థితికి చేరుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ అబ్దుల్లా షఫీక్ అద్భుతమైన డబుల్ సెంచరీకి చేరువగా వెళ్లి 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. అతని వీరోచిత ఇన్నింగ్స్ కారణంగా పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంతో 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై టెస్టుల్లో 150 కంటే ఎక్కువ పరుగులు సాధించి ఏకంగా 49 ఏళ్ల క్రితం నాటి రికార్డును అబ్దుల్లా షఫీక్ తిరగరాశాడు. చివరిసారిగా 1977లో పాకిస్థాన్ దిగ్గజ ఆటగాడు మాజిద్ ఖాన్ విండీస్ గడ్డపై 167 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత ఇన్ని సంవత్సరాలకు అబ్దుల్లా షఫీక్ మాత్రమే మళ్లీ ఈ ఘనత సాధించాడు. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై 150 ప్లస్ పరుగులు చేసిన ఐదవ పాకిస్థాన్ బ్యాటర్‌గా షఫీక్ రికార్డుల్లోకెక్కాడు. ఇక 1958లో హనీఫ్ మహమ్మద్ సాధించిన 337 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఇప్పటికీ ఇక్కడ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా ఉంది. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభంలో ఓపెనర్లు అజాన్ అవైస్ (55), ఇమామ్ ఉల్ హక్ (14) కలసి 98 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. మూడో వికెట్‌కు బ్యాటింగ్‌కు వచ్చిన అబ్దుల్లా షఫీక్, కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో కలిసి కొండంత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 183 పరుగులు జోడించారు. కెప్టెన్ బాబర్ ఆజం ఎంతో నిలకడగా ఆడి సెంచరీ దిశగా సాగినప్పటికీ, బ్రాండన్ కింగ్ వేసిన అద్భుతమైన త్రోకి 88 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అబ్దుల్లా షఫీక్ చివరి వరకు నిలబడి 160 రన్లతో పాకిస్థాన్‌ను 387 పరుగుల మార్కుకు చేర్చాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌట్ అయింది. జస్టిన్ గ్రీవ్స్ (73), రోస్టన్ చేజ్ (70) ల హాఫ్ సెంచరీలతో విండీస్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. పాకిస్థాన్ బౌలర్లలో సజిద్ ఖాన్ అత్యధికంగా 4 వికెట్లు తీసి విండీస్ నడుం విరగ్గొట్టగా, మహమ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా 2 వికెట్లు తీసి ఆకట్టుకున్నారు. పాకిస్థాన్ సాధించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆటగాళ్లు పాక్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసింది. ప్రస్తుతం విండీస్ చేతిలో 4 వికెట్లు మాత్రమే ఉండగా, కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండి ఓటమి అంచున నిలిచింది. ఈ మ్యాచ్‌ను గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1 తో సమం చేసే అవకాశాన్ని పాకిస్థాన్ చేజిక్కించుకుంది.

# భారత చీఫ్ సెలెక్టర్‌గా వీవీఎస్ లక్ష్మణ్!

## అజిత్ అగార్కర్‌పై వేటుపడే అవకాశం



భారత క్రికెట్ పురుషుల సెలెక్షన్ కమిటీ చీఫ్ సెలెక్టర్‌గా మళ్లీ తెలుగు వ్యక్తి బాధ్యతలు చేపట్టబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టీమిండియా దిగ్గజ క్రికెటర్, తెలుగు తేజం, సొగసరి బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై వేటు పడే అవకాశం ఉంది. అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా ఓ కథనాన్ని రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి ప్రమాదంలో పడింది. అతన్ని కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. భారత నయా చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో వీవీఎస్ లక్ష్మణ్ ముందంజలో ఉన్నారు. వీవీఎస్ లక్ష్మణ్ ఎంట్రీతో అజిత్ అగార్కర్‌కు ఉద్వాసన తప్పేలా లేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం చర్చల దశలోనే ఉంది. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్‌గా ఉంటే అతని మాటలకు విలువ ఉంటుందని, రోహిత్, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లు కూడా అతని సలహాలు పాటిస్తారని బీసీసీఐ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల టీమ్ సెలెక్షన్ విషయంలో అగార్కర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అగార్కర్‌ను కొనసాగించాలా? లేక లక్ష్మణ్‌ను తీసుకురావాలా?అనేది బీసీసీఐ బేరిజు వేస్తోంది. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఫలితంపైనే ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ఈ సిరీస్‌ను గెలిస్తే.. అగార్కర్ పదవీకాలం పొడిగించవచ్చు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై కూడా బీసీసీఐ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా వచ్చి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం భారత జట్టును నడిపిస్తున్న వారికి రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం ఇష్టం లేదు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఎదురైన ఓటములపై ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగలేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాతే ఈ రివ్యూ మీటింగ్ జరగాల్సింది. కానీ దేజిత్ సైకియా అనారోగ్యం కారణంగా ఈ సమీక్ష సమావేశం జరగలేదని బోర్డు వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో ఈ సమావేశం జరగనుంది. గంభీర్.. ఆన్‌లైన్ వేదికగా ఈ మీటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది.'అని అభిషేక్ త్రిపాఠి అనే స్పోర్ట్స్ జర్నలిస్ట్ తన కథనంలో రాసుకొచ్చాడు. 2023 జూలైలో భారత చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ పదవి కాలం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ముగియనుంది. టీమిండియా సపోర్ట్ స్టాఫ్ మెంబర్స్ టీ దిలీప్, ర్యాన్ టెన్ డస్కాటే తరహాలో అజిత్ అగార్కర్‌పై బీసీసీఐ వేటు వేస్తుందా? లేక కొనసాగిస్తుందా? అనేది చూడాలి. తెలుగు రాష్ట్రాల నుంచి ఎమ్మెస్కే ప్రసాద్ చివరిసారిగా భారత చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించారు.

# యూపీహెచ్‌సీ సుభాష్‌నగర్‌లో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

● వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, పాఠశాల పారిశుద్ధ్యంపై సమగ్ర పరిశీలన ● నాణ్యమైన ఆరోగ్య సేవలందించాలని అధికారుల ఆదేశం

**మేడ్చల్, ఆగస్టు 5 (ది క్రైమ్ న్యూస్):** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ బుధవారం యూపీహెచ్‌సీ సుభాష్‌నగర్‌ను ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి పనితీరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణ, ఔషధాల నిల్వలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీడీ సేవలను పరిశీలించిన ఆయన రోగుల నమోదు విధానం, రోజువారీ రోగుల వివరాలు, గర్భిణీ స్త్రీల రిజిస్టర్లు, ఎన్‌సీడీ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సూచించారు. గర్భిణీలకు అవసరమైన అన్ని పరీక్షలు సకాలంలో నిర్వహించి, తల్లి--శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఫార్మసీని పరిశీలించిన డీఎంహెచ్‌వో అత్యవసర మందుల నిల్వలు, సాధారణంగా వినియోగించే ఔషధాల లభ్యత, సమీప కాలంలో గడువు ముగియనున్న మందుల వివరాలను పరిశీలించారు. గడువు ముగిసేలోపు వాటిని నిబంధనల ప్రకారం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఔషధాల కొరత తలెత్తకుండా ఎప్పటికప్పుడు స్టాక్‌ను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓపీడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం మరింత పెరిగేలా సేవలందించాలని సూచించారు. తనిఖీ అనంతరం యూపీహెచ్‌సీ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల వంటశాల, మధ్యాహ్న భోజన తయారీ విధానం, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు,



ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన డా. కె. ఆనంద్ వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు, టీకాలు, ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. సేవల నాణ్యత పెంపు, రికార్డుల నిర్వహణ, ఔషధాల అందుబాటు, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఫార్మసీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా విక్రయాలు జరిపితే చర్యలు

● ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వి. అంకిత్ రెడ్డి ● గోదావరిఖని లక్ష్మీనగర్, అశోక్‌నగర్‌లలో అధికారుల తనిఖీలు క్వింటాల్ పచ్చడి ధ్వంసం.. నోటీసులు జారీ





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వి. అంకిత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో అక్రమంగా పచ్చళ్లు నిల్వ చేసి అమ్ముతున్నారనే సమాచారంతో నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐలు లక్ష్మణ్‌రావు, డి. రమేష్ బృందం, పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వి. అంకిత్ రెడ్డితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో లక్ష్మీనగర్‌లోని పాత రాములు హోమ్ ఫుడ్స్ దుకాణంలో ప్లాస్టిక్ డ్రమ్‌లలో నిల్వ చేసిన సుమారు 100 కిలోల మామిడికాయ పచ్చడి, 100 కిలోల నిమ్మకాయ పచ్చడిని స్వాధీనం చేసుకుని ల్యాబ్ పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించి యజమానికి నోటీసు జారీ చేశారు. అదే ప్రాంతంలోని శ్రీ వెంకటేశ్వర పికిల్స్ అండ్ హోమ్ ఫుడ్స్ దుకాణంలో లైసెన్స్ లేకపోవడంతో నమూనాలు సేకరించి వెంటనే ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ పొందాలని ఆదేశించారు. గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ప్రకాశ్ వద్ద లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల పచ్చళ్లను గుర్తించి, అందులోని ఒక క్వింటాల్ మామిడికాయ పచ్చడిని అక్కడికక్కడే నాశనం చేశారు. లైసెన్స్ పొందే వరకు విక్రయాలు ఆపాలని హెచ్చరిస్తూ నోటీసు జారీ చేశారు. ఆహార భద్రత చట్టం ప్రకారం నిబంధనలు పాటించని దుకాణాలపై తదుపరి చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే నిరంతరం ఇలాంటి సంయుక్త తనిఖీలు కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వి. అంకిత్ రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐలు లక్ష్మణ్‌రావు, డి. రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఆర్‌డబ్ల్యూఏ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం

● సమాజ అభివృద్ధే ధ్యేయంగా సేవలందించాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మేడ్చల్, ఆగస్టు 05(ది క్రైమ్ న్యూస్) :** కాప్రా పద్మశాలి టౌన్‌షిప్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ పార్క్‌లో శ్రీ భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్‌బీఆర్‌డబ్ల్యూఏ) 2026--2028 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో సభ్యుల విశ్వాసాన్ని పొందిన వెముల దీపా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించగా, ఇతర నూతన కార్యవర్గ సభ్యులు కూడా తమ తమ పదవుల బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సామాజిక సంస్థలు సమాజంలో ఐక్యత, సేవాభావం, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సమాజంలోని ప్రతి కుటుంబాన్ని కలుపుకుంటూ విద్య, వైద్యం, ఉపాధి, యువత సాధికారత, మహిళా సంక్షేమం వంటి అంశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే సంస్థకు మరింత గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, విద్యార్థులను ప్రోత్సహించడం, నిరుపేదలకు సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేస్తూ సమాజ అభ్యున్నతికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అధ్యక్షురాలు వెముల దీపా మాట్లాడుతూ సభ్యులు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకంగా, సేవా దృక్పథంతో పనిచేస్తామని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, పేదలకు విద్యా సహాయం, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, మహిళల సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సభ్యుడి సహకారంతో సంస్థను మరింత బలోపేతం చేసి సమాజానికి ఆదర్శవంతమైన సేవా సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు బి. సదానందం, ప్రధాన కార్యదర్శి బోగా వెంకటేష్, కోశాధికారి జయకర్ దర్గా, సంయుక్త కార్యదర్శి నరసింహులు కోల, కార్యవర్గ సభ్యులు ఎన్. రామాదేవి, మేదరి సుభాష్, గండ్ల విజయ్‌కుమార్, సందీప్ జాదలతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి శాలువాలతో సత్కరించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సభ్యులు సంస్థ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీతా ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ యాదగిరి గౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి, బిజెపి నాయకులు కనుకుల రజినీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కాప్రా,





కుషాయిగూడ, వంపుగూడ డివిజన్ అధ్యక్షులు తన్నీరు శ్రీహరి, కౌకుట్ల ప్రకాష్ రెడ్డి, అనిల్ యాదవ్, జిల్లా మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ విట్టల్ నాయక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభ అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజ శ్రేయస్సే పరమావధిగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని, భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ సామాజిక సేవలో మరింత ముందంజలో నిలవాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# కాప్రా సర్కిల్ కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల ఉత్సవాలు

**మహిళా ఉద్యోగుల బోనాలు.. పోతరాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్ల మధ్య సందడిగా వేడుకలు**





**మేడ్చల్, ఆగస్టు 05( ది క్రైమ్ న్యూస్):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకుని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆవరణలో బోనాల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. కాప్రా సర్కిల్, నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ శాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, మహిళా సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీంద్ర సాగర్, నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు కోరుతూ నియోజకవాసుల సుఖసంతోషాలు, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, మున్సిపల్ శాఖ అభివృద్ధి కోసం ప్రార్థనలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో రంగురంగుల బోనాలను తలపై మోసుకుంటూ ఆలయానికి చేరుకుని ధూప, దీప, నైవేద్యాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తిగీతాల నడుమ అమ్మవారిని కీర్తిస్తూ మహిళలు చేసిన నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ప్రాంగణం జై మహంకాళి నినాదాలతో మారుమోగింది. పోతరాజులు కాలికి గజ్జెలు కట్టి వీరంగం చేస్తూ మహంకాళి అమ్మవారి భక్తిగీతాలకు అనుగుణంగా నృత్య ప్రదర్శనలు ఇవ్వగా భక్తులు ఉత్సాహంగా వీక్షించారు. భాజాభజంత్రీలు, డప్పు చప్పుళ్లు, సంప్రదాయ వాయిద్యాల నడుమ అధికారులు, ఉద్యోగులు సైతం ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ బోనాల సంబరాల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు సాంస్కృతిక కళారూపాలతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కళ్యాణి రాణి, టీపీఎస్ తుల్జా సింగ్, చైన్‌మన్ శ్రీధర్, రమేష్, రాజు, నరేష్, ప్రైవేట్ ఎంప్లాయిస్ కాప్రా బిఎంఎస్ అధ్యక్షులు రాజ్ కుమార్, ఎల్లయ్య, యాదగిరి, అబ్బు, తదితరులతో పాటు ఇంజినీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, పారిశుధ్య, అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, అధికారులు, ఉద్యోగులందరికీ అన్నప్రసాదం పంపిణీ చేసి బోనాల వేడుకలను ఘనంగా ముగించారు.

## శేరిలింగంపల్లి 92 దేవాలయాలకు రూ.30.71 లక్షల ఆర్థిక సాయం అందజేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 92 దేవాలయాలకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30,71,000 ఆర్థిక సహాయాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆలయ ధర్మకర్తలకు అందజేశారు. ఆషాఢ మాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.20కోట్ల నిధులు మంజూరు చేశారని, అందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71లక్షలు కేటాయించ బడినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు తదితర అన్ని మౌలిక సదుపాయాలను సమన్వయంతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించిన ఆరెకపూడిగాంధీ, ప్రభుత్వం సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో పార్కుల పచ్చదనానికి నూతన బోర్‌వెల్స్ ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాశ్ నారాయణ్ నగర్, ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీల పార్కుల్లో మొక్కల సంరక్షణ, పచ్చదన పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్స్‌ను మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండారు మోహన్ ముదిరాజ్, అట్టేపల్లి రామ ప్రభు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ పార్కులు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా పర్యావరణ సమతుల్యత, ప్రజల ఆరోగ్యం, భావితరాల సంక్షేమానికి ఎంతో అవసరమని అన్నారు. పార్కుల్లో నాటిన మొక్కల సంరక్షణకు నిరంతర నీటి సరఫరా అవసరమనే ఉద్దేశంతో బోర్‌వెల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బోర్‌వెల్స్ ద్వారా ఏడాది పొడవునా మొక్కలకు తగినంత నీరు అందించి పార్కుల్లో పచ్చదనాన్ని మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతమవుతాయని, కాలనీవాసులు పార్కులను తమ సొంత ఆస్తిగా భావించి పరిశుభ్రత, మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో మియాపూర్ డివిజన్‌లోని ప్రతి కాలనీలో పచ్చదనం పెంపొందించేందుకు, పార్కుల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల విస్తరణకు నిరంతరం కృషి చేస్తామని ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయప్రకాశ్ నారాయణ్ నగర్, ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీల నివాసితులు మోహన్‌రావు, మహేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకట్రావు, సీతాకుమారి, మంజుల, చంద్రహాస్, రాములు, దయాకర్, వినీత్, నాయుడు, యూబీడీ సూపర్‌వైజర్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేసిన కౌన్సిలర్ వెంకట నాగేశ్వరరావు బాబు



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మున్సిపాలిటీలో ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం నాడు సీఎం బ్రేక్ ఫాస్ట్ పథక స్కీం దృష్టినందుంచుకొని విద్యార్థినులకు 200ల స్టైన లెస్టీల్ గ్లాస్సెస్‌లను మున్సిపల్ 16వ వార్డ్ కౌన్సిలర్ వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు (బాబు) అందజేశారు,ఈ కార్యక్రమంలో పాఠశాల, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయునులు శ్రీమతులు ఎన్ హైమావతి, ఎస్ వివేక,ఎంజివి ప్రసన్న, స్వరూప,విజయ్ కుమార్, స్టాఫ్ శ్రీధరరెడ్డి పట్టణ ప్రముఖులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం సట్టు వెంకటేశ్వరులు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు,విద్యార్థులు ఆహుతు లందరికి ప్రత్యేకించి ఉపకారి కౌన్సిలర్ నాగేశ్వరరావుకు సంతోషం తో కృతజ్ఞతలు తెలియజేసారు, సీఎం బ్రేక్ ఫ్దాస్ట్ పథకం నిర్వి ఘనంగా ప్రభుత్వం కొనసాగించాలని కోరారు.

## అధిక రక్తపోటును ఇలా కూడా గుర్తించవచ్చు..

కానీ పరీక్షల చేయించుకున్న తర్వాత గానీ చాలా మందికి శరీరంలో అధిక రక్తపోటు ఉన్నట్లు అర్థమవుతుంది. నిజానికి మైకము, భయము, చెమట, నిద్రలేమి అధిక రక్తపోటు వంటి ప్రారంభ లక్షణాలు ద్వారా అధిక రక్తపోటును గుర్తించవచ్చంటున్నారు నిపుణులు. కానీ ఈ లక్షణాలు చాలా సాధారణం. వీటి ద్వారా మాత్రమే అధిక రక్తపోటుతో బాధపడుతున్నారా లేదా అని నిర్ధారించడం సాధ్యం కాదు. 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' ప్రకారం.. కళ్లు ఎరుపు రంగులోకి మారడం, కనుగుడ్డుపై ఎర్రటి రక్తపు ఛాయలు కనిపించడాన్ని సబ్‌కంజంక్టివల్ హెమరేజ్ అని పిలుస్తారు. ఇది అధిక రక్తపోటు హెచ్చరిక సంకేతంగా పరిగణిస్తారు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. డయాబెటిక్ రోగుల కంటి రంగు కూడా కొన్నిసార్లు ఎరుపు రంగులో ఉంటుంది. ఇవే లక్షణాలు అధిక రక్తపోటు ఉన్న రోగులలో కూడా కనిపిస్తాయి. ఫలితంగా, ఇది రెండు వ్యాధుల సాధారణ లక్షణంగా పరిగణిస్తుంటారు. ముఖం ఎర్రబడటం, ఎరుపు కళ్ళు అధిక రక్తపోటు ప్రారంభ సంకేతాలు. ముఖంలోని రక్తనాళాలు పల్చగా మారినప్పుడు ముఖం ఎర్రబారడం జరుగుతుంది. కాబట్టి మీరు ఈ విషయాలన్నీ గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# విశ్వజి



## దుర్వాసన దూరం..

గుట్కాలు తినేవారిలో, మద్య పానం-ధూమపానం చేసేవారిలో నోటి దుర్వాసన ఎక్కువగా కనిపిస్తుంది. దంతధావనం సరిగ్గా చేయపోయినా.. ఈ సమస్య వేధిస్తుంది. కానీ, కొందరిలో ఏ దురలవాట్లూ లేకపోయినా.. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసినా.. నోటి నుంచి చెడువాసన వస్తుంటుంది. ఇది నలుగురిలో తీవ్రమైన ఇబ్బందికి గురిచేస్తుంది. కాబట్టి, నోటి దుర్వాసనను దూరం చేసే కొన్ని ఇంటి చిట్కాలను నిపుణులు వివరిస్తున్నారు. నోటిలో పేరుకుపోయే బ్యాక్టీరియా, ఇతర ఆరోగ్య సమస్యలు.. నోటి దుర్వాసనకు ప్రధాన కారణాలు. కాబట్టి, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడంతోపాటు ఫ్లాస్ చేయడం, నాలుకపై బ్యాక్టీరియాను తొలగించుకోవడం ముఖ్యం. నోటి దుర్వాసనను కలిగించే బ్యాక్టీరియాను ఉప్పు నీటితో పుక్కిలించడం ద్వారా నిర్మూలించవచ్చు. బేకింగ్ సోడాలో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీనిని మౌత్ వాష్‌గా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి. నోరు పొడిబారినా.. దుర్వాసన వేస్తుంది. కాబట్టి, ఈ సమస్య నుంచి బయట పడటానికి నీళ్లు ఎక్కువగా తాగండి. దాంతో, శరీరం హైడ్రేటెడ్‌గా ఉండి, నోటి ఆరోగ్యం బాగుంటుంది. శ్వాసను తాజాగా ఉంచడంలో తులసి, పుదీనా ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. రాత్రిపూట విధులు నిర్వహించే సమయంలో.. తులసి, పుదీనా ఆకులను నమలండి. ఆపిల్, క్యారెట్లు, పుచ్చకాయలు, పైనాపిల్ వంటి పండ్లు.. నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. నోటిలో బ్యాక్టీరియాను తొలగించడం, లాలాజల ఉత్పత్తిని పెంచడంలో ముందుంటాయి. అయినా.. సమస్య అలాగే ఉంటే దంతవైద్యులను సంప్రదించండి.

## నిద్ర రావట్లేదా?

వృద్ధుల్లో నిద్రలేమి సాధారణ సమస్యగా మారింది. నిద్ర మాత్రలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించినా.. తరచుగా వాడితే దుష్ప్రభావాల ప్రమాదం ఉంటుంది. ఇందుకు నిపుణులు సిఫారసు చేస్తున్న ఒక సులభమైన చిట్కా.. క్రమం తప్పని శారీరక శ్రమ. వయసు పెరిగేకొద్దీ.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. అదనంగా ఆర్థరైటిస్, గుండె సమస్యలు, మందుల వాడకం వంటివి నిద్రకు భంగం కలిగిస్తాయి. దాంతో పెద్దవాళ్లు నిద్రపోవడంలో ఇబ్బంది పడుతుంటారు. రాత్రిపూట తరచుగా మేల్కొంటూ ఉంటారు. ఫలితంగా జ్ఞాపకశక్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. వీటినుంచి బయటపడాలంటే.. వృద్ధుల్లో నిద్ర సమస్యలను నివారించాలి. అందుకు 'వ్యాయామం' చక్కని పరిష్కారం చూపుతుంది. వ్యాయామంతో నిద్ర... చిన్నచిన్న వ్యాయామాలతోనూ కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు తగ్గుతాయి. దాంతో ఒత్తిడి, ఆందోళన దూరమవుతుంది. మనసు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. వ్యాయామం.. జీవ గడియారాన్ని రీసెట్ చేస్తుంది. ముఖ్యంగా ఉదయంపూట ఆరుబయట నడక వల్ల.. శరీరానికి సహజమైన సూర్యకాంతి అందుతుంది. ఇది రాత్రిపూట మెలటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. మితమైన వ్యాయామంతో శరీరం ఆరోగ్యకరమైన రీతిలో అలసిపోతుంది. ఫలితంగా.. రాత్రిపూట మంచి నిద్రపట్టేస్తుంది. సాయంత్రాల్లో ఓ మోస్తరు యోగాసనాలు వేయడం వల్ల.. శరీరానికి తగినంత విశ్రాంతి లభిస్తుంది. రాత్రి గాఢనిద్రలోకి జారుకునేలా చేస్తుంది. నిరంతరం వ్యాయామం చేసే వృద్ధులు నాణ్యమైన నిద్రపోతారని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, పడుకునే రెండు గంటల ముందు వ్యాయామాలకు దూరంగా ఉండటమే మంచిది. వ్యాయామం.. కేవలం శారీరక ఆరోగ్యం కోసమే కాదు. ఇది పెద్దల్లో మనశ్శాంతిని పునరుద్ధరిస్తుంది.

# లైఫ్ ట్రాప్స్‌లో లవ్



ఈరోజుల్లో ప్రేమంటే? కాఫీ డేట్స్, రీల్స్, స్టోరీస్‌లో లవ్ వైబ్స్, షాపింగ్.. అంతేనా? నిజానికి బంధాలు అంత తేలికైనవి కావు. మీరు మనస్ఫూర్తిగా ఎవరినైనా ప్రేమిస్తే, ఆ బంధం మీకు సంతోషాన్ని ఇవ్వాలి. కానీ, కొన్నిసార్లు ప్రేమ పేరుతో విసిరే ఉచ్చులో మనం చిక్కుకుపోతుంటాం. పదేపదే మనకు సరిపోని వాళ్ల మాయలోనే పడిపోతుంటాం. అందుకు కారణం కూడా మన ఆలోచనలే కావడం విచిత్రం. మనలో కొన్ని 'లైఫ్ ట్రాప్‌లు' పనిచేస్తుంటాయి అని మీకు తెలుసా? బాల్యంలో మొదలయ్యే కొన్ని భావనలు పెద్దయ్యాక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. డాక్టర్ జెఫ్రీ యంగ్ అనే సైకాలజిస్ట్ 'స్కీమా థియరీ'తో ఈ 'లైఫ్ ట్రాప్‌ల' గురించి ఏనాడో చెప్పారు. ఇవి మన ఆలోచనల్ని, నిర్ణయాల్ని ప్రభావితం చేస్తాయి. సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో తప్పులు చేసేలా ప్రోత్సహిస్తాయి. చివరికి ఇంకేముంది హార్ట్‌బ్రేక్!! అమ్మాయిలు ముఖ్యంగా మూడు లైఫ్‌ట్రాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతుంటారు. ఎమోషనల్ డిప్రివేషన్ (భావోద్వేగాల లేమి), అబాండన్‌మెంట్ (విడిచి వెళ్లిపోతారేమో అనే భయం), సెల్ఫ్ శాక్రిఫైస్ (స్వీయ త్యాగం). ఈ మూడు ధోరణుల వల్ల భాగస్వామి ఎంపికలో, ప్రేమను నిలబెట్టుకోవడంలో తప్పులు చేస్తుంటారు.

కావాల్సిన ప్రేమ దొరకదేమో?!

నాకు కావాల్సిన ప్రేమ దొరకడం లేదు!! వాళ్లు నన్ను ప్రేమించినా.. సరిగ్గా వ్యక్తపరచడం లేదు.. ఇలాంటి ఆలోచనలు మీలో ఉన్నాయా? చిన్నప్పుడు మీకు సరైన ఆప్యాయత దొరకలేదా? అమ్మానాన్నలు దూరంగా ఉన్నారా? వాళ్లు మీకు అన్నీ ఇచ్చినా, మీ మనసులో ఏం ఉందో అర్థం చేసుకోలేదా? అలాంటప్పుడు, మీరు భావోద్వేగాలు అంతగా వ్యక్తపరచని వ్యక్తులకే త్వరగా ఆకర్షితురాలు అవుతారు. చిన్నప్పటి నుంచి భావోద్వేగాల లేమితో సతమతమైన మీ మనసు.. మీ తరహా వ్యక్తిత్వం ఉన్నవారికే అట్రాక్ట్ అవుతుంది. కానీ, లేనిది వెతుక్కోవడమే కదా జీవితం! బాల్యం నుంచి దొరకని ఆప్యాయత భాగస్వామి నుంచి ఆశించడం తప్పు కాదు. కన్సర్న్ చూపించే వారిని కాదని, మీలా బోర్‌గా ఫీలయ్యే వాళ్ల వెంటపడితే.. చివరికి జీవితంలో భావోద్వేగాలు మృగ్యమైపోతాయి.

నన్ను వదిలేస్తారేమో?! ప్రేమించినవాడు వదిలేస్తాడేమో అన్న అనుమానం..

### వాళ్లు కాస్త దూరం జరిగినా ఆత్మరక్షణలో పడిపోవడం..

మీలో ఈ తరహా ఫీలింగ్స్ వస్తుంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. చాలామంది తల్లిదండ్రులు ఎప్పుడూ ఒకేలా ఉండరు. పిల్లలంటే ప్రేమ ఉన్నప్పటికీ% పరిస్థితులను బట్టి వాళ్ల అభిమానం వ్యక్తమవుతూ ఉంటుంది. కొన్నిసార్లు అతి గారాబం చేయడం, కొన్నిసార్లు మరీ ఎక్కువ నిర్లక్ష్యం చేయడం లాంటి పరిస్థితులు ఎదుర్కొన్న ఆడపిల్లల ఆలోచన కాస్త చిత్రంగా ఉంటుంది. ప్రేమలో అడుగుపెట్టినప్పటి నుంచి అనుమానాలు వాళ్లను పీడిస్తూ ఉంటాయి. భాగస్వామి ఏ కొంచెం స్పందించకపోయినా.. అతిగా స్పందిస్తుంటారు. ఎప్పుడూ అతణ్నే అంటిపెట్టుకొని ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. మరింత గాఢమైన ప్రేమను ఆశిస్తూ ఉంటారు. ఈ భయం మీ నిబద్ధతను చూపించకపోగా, నిజమైన ప్రేమను కూడా అంగీకరించలేని పరిస్థితిలోకి నెట్టేస్తుంది.

ప్రాణం అయినా ఇస్తాను

నా భాగస్వామి సంతోషంగా ఉంటే చాలు.. వాళ్ల కోసంఏదైనా చేస్తాను..

పైకి చూస్తే ఇలా ఆలోచించడం గొప్ప విషయమే! ప్రేమంటే త్యాగమే!! కానీ, లవ్‌జర్నీలో ఇదో ప్రమాదకరమైన ట్రాప్. చిన్నప్పటి నుంచి ఇంట్లోవాళ్ల కోసం త్యాగాలకు అలవాటుపడిన ప్రాణమైతే మరీ ప్రమాదం. ఎదుటివ్యక్తిని సంతోషపర్చడానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడుతుండటం అలవాటుగా చేసుకుంటారు. ఇక ప్రేమించిన వ్యక్తి కోసం విపరీత త్యాగాలకు పాల్పడుతుంటారు. సరైనోడు అయితే త్యాగం చేసినా కొంత ఫర్వాలేదు. కానీ, మీ బలహీనతను అలుసుగా తీసుకునే బాపతు ప్రేమికుడు ఎదురుపడితే.. మీ త్యాగాలకు విలువ ఉండదు సరికదా, కొన్నిసార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి కూడా రావొచ్చు. ఈ త్యాగశీలురు తమ భాగస్వామి నుంచి కూడా అదే తరహా త్యాగాలను ఆశిస్తే% మీ ప్రేమ మొగ్గలోనే వాడిపోవడం ఖాయం. జెన్-జీ అమ్మాయిలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రపంచంలో పెరుగుతున్నారు. వారికి బంధాలపై స్పష్టమైన అవగాహన ఉండటంలేదు. అపరిచితులతో తేలికగా కనెక్ట్ అవుతున్నారు. ఈ క్రమంలో బాల్యంలో ఎదురైన అనుభవాలు, మనసుకు తగిలిన గాయాలు.. ఈ సంబంధాలపై పడితే.. మరింత డేంజర్ జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి, రిలేషన్‌లోకి ప్రవేశించడానికి ముందు.. మానసికంగా దృఢంగా ఉండాలి. ఎదుటివ్యక్తిని సరిగ్గా అంచనా వేయగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రేమను పొందే అవకాశాలు ఉంటాయి.

# జుట్టుకు మునగాకు!



మునగ ఆకుల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి అనేక శారీరక సమస్యలను దూరం చేస్తాయి. జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ముందుంటాయి. మునగాకులో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ బి6, సి, ఐరన్, జింక్, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. అవన్నీ జుట్టు సమస్యలకు చక్కటిపరిష్కారం చూపుతాయి. మునగాకుతో హెయిర్ ప్యాక్స్ తయారుచేసుకొని వాడితే.. అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. తయారీ విధానం.. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. రెండిటినీ బాగా మిక్స్ చేసి.. కొద్దికొద్దిగా పెరుగు కలుపుతూ మెత్తని పేస్ట్ తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టేలా జుట్టుకు ప్యాక్ వేసుకోవాలి. అరగంట సేపు అలాగే ఉంచి.. గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలు.. మునగాకులో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ గుణాలు పుష్కలం. ఇవి జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. వెంట్రుకలు ఒత్తుగా పెరిగేందుకు సాయపడతాయి. ఇందులో ఉండే జింక్.. జుట్టు కుదుళ్లలోని సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది. దాంతో కుదుళ్లు తేమగా మారుతాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తరిమేస్తాయి. తెల్ల జుట్టు సమస్యకూ మునగాకు చక్కని పరిష్కారం. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. వెంట్రుకలు నెరవడానికి కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. మునగాకులో ఉండే బెహెనిక్, ఓలియిక్ ఆమ్లాలు.. జుట్టు ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. కుదుళ్లలో ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యల్ని తగ్గిస్తాయి.

# మార్కెట్

## ముంబైలో టెస్లా తొలి షోరూం.. నెల అద్దె ఎంతో తెలుసా..?

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత విపణిలోకి అడుగుపెట్టింది. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంఛ్ చేసింది. ఈ షోరూం కోసం బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకుంది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగానూ కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె (%వీశీత్ప్రశ్రీఎ =వత్%) చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. మరోవైపు తొలిషోరూం కోసం టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ రెండో షోరూంను ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సమాచారం.




## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్.. 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్..!

దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్



రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, నిప్పాన్ లైఫ్, హెచ్‌డీఎఫ్ ఏఎంసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, జిల్లెట్ ఇండియా, యూటీఐ ఏఎంసీ, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అనుపమ్ రసాయనన్, లారస్ ల్యాబ్స్, ఈఐడీ ప్యారీ, గ్లోబల్ హెల్త్, సియట్, జేఎం ఫైనాన్షియల్ ఉన్నాయి.

# ఆంధ్రప్రదేశ్

## జీవో నెంబర్ లు 21, 31ని తక్షణమే రద్దు చేయాలి

### ఏ ఐ టి యు సి ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్

ఏలూరు, ఆగస్టు 5 : ఆటో,మోటర్ ట్రాన్స్పోర్ట్ వాహనాలపై భారీగా జరిమానాలు పెంచే జీవో నెంబర్ లు 21, 31ని తక్షణమే రద్దు చేయాలని ఏ ఐ టి యు సి ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్లో ఉన్న మదర్ థెరిస్సా ఆటో స్టాండ్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఆటో మరియు మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగవ మహాసభల గోడపత్రికలను ఏఐటీయూసీ నాయకులు మరియు ఆటో కార్మికులు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో మరియు మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాలుగో మహాసభలు ఆగస్టు 20,21 తేదీలలో విశాఖపట్నంలో జరుగుతున్నాయని శ్రీనివాస్ డాంగే తెలిపారు. మహాసభల గోడపత్రికల ను ఆవిష్కరించిన అనంతరం డాంగే మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హెవి వెహికల్ డ్రైవర్లకు కనీస వేతనం నెలకు 36,000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు సందర్భంగా ఆగస్టు 20 జరుగుతున్న ప్రదర్శనకు, ఆగస్టు 21న జరుగుతున్న ప్రతినిధుల సభకు ఏలూరు నుంచి ప్రతినిధులు హాజరవ్వాలని డాంగే కోరారు.ఏ ఐ టి యు సి ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు టాక్సీ, గ్రీన్ టాక్సీ లను 30శాతం తగ్గించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త వాహనాలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ తో రుణాల మంజూరు చేయాలని వారు కోరారు. మథర్ థెరిస్సా ఆటో యూనిట్ అధ్యక్షులు కాశీ కృష్ణ మాట్లాడుతూ రాపిడో వచ్చిన తర్వాత ఆటో కార్మికులకు కిరాయిలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆంధ్రలో అనుసరించడం వల్ల ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఉచిత బస్సు లాగే ప్రభుత్వం ఉచిత ఆటో ప్రయాణం తీసుకొస్తే ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడతారని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో మరియు మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల ను జయప్రదం చేయాలని పవర్ పేట స్టేషన్, 12 పంపుల సెంటర్లో ఉన్న ఆటో స్టాండ్ లలో ఏఐటీయూసీ నాయకులు ప్రసారం చేశారు. రాష్ట్ర మహాసభల గోడ పత్రికలు ఆవిష్కరణలో ఆటో యూనియన్ నాయకులు నే దూరి జగన్, షేక్ ఆసిఫ్, వై బాబు, బి సంజయ్ రావు, వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వివాఖిలో పివి సింధు స్పోర్ట్స్ అకాడమీ

### శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్
### ప్రపంచస్థాయి క్రీడాకారునలు తయారు చేయడమే లక్ష్యం

విశాఖపట్నం,ఆగస్ట్5 : ప్రపంచ స్థాయి క్రీడాకారులను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. యువత ముఖంలోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. పీవీ సింధు అకాడమీ ద్వారా క్రీడాకారులు వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఎలాంటి సదుపాయాలు లేని రోజుల్లోనే పట్టుదల, క్రమశిక్షణతో సింధు ఒలింపిక్స్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగారని ఉద్ఘాటించారు. విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో తలపెట్టిన పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేశ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. ప్రతి ఛాంపియన్ వెనుక కష్టపడిన తల్లిదండ్రులు, ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచే కోచ్‌లు ఉంటారని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. కేవలం బ్యాడ్మింటనే కాకుండా, అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా ఈ అకాడమీని తీర్చిదిద్దాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ అకాడమీ రూపుదిద్దుకుంటోందని వివరించారు. ఈ సంస్థ బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా.. స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు కూడా నిలయంగా మారనుందని వెల్లడించారు. ఆస్ట్రేలియా, ఖతార్ తరహాలో మన దేశంలోనూ ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ సంస్థ వేదిక కానుందని తెలిపారు. విశాఖపట్నంలో ఈ అకాడమీ నిర్మాణం విజయవంతం కావడానికి తమ ప్రభుత్వం, ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 90వ దశకంలోనే క్రీడలపై సీఎం చంద్రబాబు నమ్మకం ఉంచారని ప్రస్తావించారు. ఆ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించి క్రీడా విప్లవానికి చంద్రబాబు బాటలు వేశారని ఉద్ఘాటించారు. ఈ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక క్రీడలకు కేంద్రంగా మారి ఆంధప్రదేశ్‌లో క్రీడా సంస్కృతిని పెంచుతుందని వివరించారు. తరగతి గది జ్ఞానాన్ని ఇస్తే, క్రీడలు మనకు వ్యక్తిత్వాన్ని, పోరాట పటిమను నేర్పుతాయని చెప్పుకొచ్చారు. అందుకే ఏపీలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించామని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ఒక సహజ ప్రతిభ దాగి ఉంటుందని వివరించారు. దానిని వెలికితీసి ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## ఎపికి విదేశీ పెట్టుబడుల వెల్లువ

### లోక్‌సభలో వైసిపి సభ్యుడి ప్రశ్నకు కేంద్రం సమాధానం

న్యూఢిల్లీ,ఆగస్ట్5 : ఆంధప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేందప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 - 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 - 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది.

## మత్స్యకారులకు చారిత్రక భరోసా

### బీమా, సబ్సిడీ, భృతిలో కూటమి ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలు

- గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బీమా పరిహారాలన్నీ చెల్లింపు
- విద్యుత్ సబ్సిడీలో భారీ పెంపు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి, ఆగస్ట్ 05 : మత్స్యకారుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రతి అంశంలోనూ న్యాయం చేస్తూ, మత్స్యకార కుటుంబాలకు నిజమైన భరోసా కల్పిస్తున్నామన్నారు. మాటల్లో కాదు... చేతల్లో సంక్షేమాన్ని చూపించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మత్స్యకారుల బీమా పరిహారాలను పూర్తిగా చెల్లించడంతో పాటు, బీమా పథకాన్ని విస్తరించడం, విద్యుత్ సబ్సిడీని గణనీయంగా పెంచడం, వేట నిషేధ కాల భృతిని భారీగా పెంచి అందించడం వంటి అనేక చారిత్రక నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గణాంకాలే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, గత ప్రభుత్వ వైఫల్యాలకు ప్రత్యక్ష సాక్ష్యాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మత్స్యకారులకు నిజమైన మేలు జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాల హయాంలోనే జరిగిందని, మత్స్యకారుల సంక్షేమాన్ని రాజకీయాల కోసం కాకుండా బాధ్యతగా భావించి పనిచేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా నిరాశపరిచింది. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు అందాల్సిన బీమా పరిహారాలు, నష్టపరిహారాలను సైతం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవాల్సిన సమయంలో కూడా ఆ ప్రభుత్వం మానవత్వం చూపలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బీమా పరిహారాలన్నింటినీ చెల్లించి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాం. ఈ బీమా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,56,66,000, కేంద్ర ప్రభుత్వం రూ.4,20,00,000 వెచ్చిస్తూ, మొత్తం రూ.6,76,66,000తో మత్స్యకార కుటుంబాలకు రక్షణ కల్పిస్తోంది. అంతేకాదు, కేవలం సంప్రదాయ మత్స్యకారులకే కాకుండా అర్హులైన మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకువచ్చి, వారి కుటుంబాలకు భరోసా కల్పించే చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. గత ప్రభుత్వంతో పోలిస్తే మత్స్యకారుల బీమా పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, గతంలో 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మత్స్యకారులకు మాత్రమే బీమా వర్తించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వయోపరిమితిని 18 నుంచి 70 సంవత్సరాలకు పెంచి మరింత మంది మత్స్యకారులకు భరోసా కల్పించామని చెప్పారు.గతంలో ఈ పథకం కేవలం సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ప్రస్తుతం సముద్ర మత్స్యకారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో చేపల వేట, చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారులకు కూడా బీమా వర్తించేలా విస్తరించామని మంత్రి వివరించారు. గతంలో సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే రూ.5 లక్షల బీమా సౌకర్యం అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం పథకాన్ని విస్తరించి సుమారు 8 లక్షల మంది వరకు బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వంలో వేట చేస్తున్న సమయంలో మరణించినప్పుడే రూ.5 లక్షల బీమా పరిహారం లభించేదని, కానీ కూటమి ప్రభుత్వం ఆ పరిమితిని తొలగించి ఫిషింగ్ కార్యకలాపాల్లో ఉన్న సమయంలోనైనా, ఇంటి వద్ద ఉన్నప్పుడైనా, ఏ కారణంతో మరణించినా అర్హులైన మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందేలా చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. గతంలో ఈ పథకం ప్రత్యక్షంగా చేపల వేటలో పాల్గొనే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ఇప్పుడు రొయ్యల పరిశ్రమలు, ఫీడ్ పరిశ్రమలు, రొయ్యలు, చేపల చెరువులు తదితర మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, మత్స్యకారులు, మత్స్యరంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా రూ.6.82 కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మందికి బీమా రక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

## రైతుల ఆత్మహత్యలు కనబడడం లేదా

### ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు
### చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు నష్టపోతున్నాయి
### దేవరపల్లి పర్యటలో జగన్ ఘాటు విమర్శలు
### పొగాకు రైతులకు జగన్ పరామర్శ



కాకినాడ,ఆగస్ట్5 : ఏపీలో చంద్రబాబు పాలనలో విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో విధ్వంసం కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేక పొగాకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ బుధవారం తూర్పు గోదావరి జిల్లాలోని దేవరపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పొగాకు యార్డులో రైతులను పరామర్శించి.. కొనుగోలు కేంద్రం వారితో ముఖాముఖి అయ్యారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు నష్టపోతున్నాయి. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో విధ్వంసం కనిపిస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులు. చంద్రబాబుది వెన్నుపోటు పార్టీ. చంద్రబాబు వల్ల ప్రజలకు బాధే మిగిలింది. 27 నెలల బాబు పాలనలో రైతులకు గిట్టుబాటు ధర లేదు. రాష్ట్రంలో రైతులు రోడ్డునపడ్డారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వానికి కనబడటం లేదా?. బాధిత రైతు కుటుంబాలను కనీసం పరామర్శించలేదు. చంద్రబాబు పాలనలో రైతులు నష్టపోయారు. పొగాకుతో పాటు ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు. పొగాకు రైతులు ఆందోళనలో ఉన్నారు. గిట్టుబాటు ధర రాక వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పెద్దలు పరామర్శించలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో పొగాకు ధర రూ.289గా ఉంది. కానీ, ఇప్పుడు కేజీ పొగాకు ధర రూ.236 మాత్రమే పలుకుతోంది. కూటమి ఉత్తరాది ప్రాంతంలో టొబాకో బోర్డు 49.70 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినప్పటికీ 10 మిలియన్ కేజీలు (20? కంటే తక్కువ) మాత్రమే కొనుగోలు చేశారు. ?రాష్ట్రంలో ఈ సంవత్సరం 232 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి కాగా. ఇప్పటివరకు కేవలం 47.3 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు జరిగింది. వేలం కేంద్రాలలో 30నుండి 40శాతం వరకు పొగాకును రిజెక్ట్ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ప్రతి గ్రేడ్‌కు ప్రారంభ ధరను నిర్ణయించడం వల్ల కంపెనీల మధ్య పోటీ పెరిగి రైతులకు మంచి ధర లభించింది. రూ. 3,000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఐదేళ్లలో రూ. 7,800 కోట్ల మేర కొనుగోళ్లు చేపట్టాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు రూ. 1 లక్ష వరకు సున్నా వడ్డీ రుణాలు ఇచ్చాం. 84.66 లక్షల మంది రైతులకు రూ. 2,050 కోట్లు అందించాం. చంద్రబాబు వచ్చాక సున్నా వడ్డీ పథకం రద్దు చేశారు. రైతు భరోసా సాయంలో కూడా కోతలు పెట్టారు. చంద్రబాబు పాలన రైతులకు హానికరం. కూటమి ప్రభుత్వం దళారీతో రాజీ పడింది. దళారులు సిండికేటుగా మారి రైతుల పొట్టగొడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఆదుకుంటాం' అని హామీ ఇచ్చారు. అంతకుముందు.. వైఎస్ జగన్‌తో దేవరపల్లి పొగాకు రైతులు తమ ఆవేదనను చెప్పుకున్నారు. గిట్టుబాటు ధర లేదని వాపోయిన పొగాకు రైతులు. కూటమి ప్రభుత్వం వచ్చాక నష్టపోయామని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ఎమ్మెల్యే, ఎంపీగానీ ఇక్కడికి రాలేదన్న రైతులు. 98 శాతం పొగాకును రూ.170కే కొంటున్నారు. మీరు వస్తున్నారని రూ.10 పెంచారు. వైఎస్సార్‌సీపీ హయాంలో లక్ష వరకు వడ్డీ లేని రుణాలు ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో రుణానికి వడ్డీ వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందన్నారు. కేజీ పొగాకుకు రూ.70 నష్టపోతున్నాం. పొగాకు కొనే దాని కంటే రిజక్ట్ చేసేదే ఎక్కువ. ఎకరానికి రూ.3 లక్షల పెట్టుబడి.. గిట్టుబాటు రావడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో లోగ్రేడ్ పొగాకు కూడా కొనేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వంతో మేము నష్టపోతున్నాం అని అన్నారు.

## గోదావరి పుష్కరాలు -2027 ఏర్పాట్లపై సమీక్ష

ఏలూరు, ఆగష్టు, 5 : గోదావరి పుష్కరాలు -2027 ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుండి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్,గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి ,వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ లతో కలిసి బుధవారం సంబంధిత శాఖల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా స్నాన ఘాట్ల ఏర్పాట్లు, ఘాట్లలో మౌలిక సదుపాయాలు, ఆయా ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, రవాణా, భద్రత, తదితర ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు సమర్పించిన ప్రతిపాదనలపై సమీక్షించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలో 28 స్నాన ఘాట్ల ఏర్పాటుకు గుర్తించామన్నారు. పోలవరం లో 20, కుక్కునూరు లో 3, వేలేరుపాడులో 5 ఘాట్ల ఏర్పాటు, ఆయా ఘాట్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

## జగన్ దేవరపల్లి పర్యటన

### భారీగా తరలివచ్చిన అభిమానులు


కాకినాడ,ఆగస్ట్5 : కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారంటూ వారి సమస్యలను తెలుసుకునేందుకు జగన్ దేవరపల్లి పర్యటన చేపట్టారు. రైతులను పరామర్శించడంతో పాటు పొగాకు యార్డ్‌ను పరిశీలించారు. అయితే ఈ పర్యటనకు పోలీసులు పలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో.. జనసందోహం మాత్రం తగ్గలేదు. బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లు, నియంత్రణ చర్యలు ఉన్నప్పటికీ జగన్‌ను చూసేందుకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రోడ్ల వెంట, పర్యటన మార్గాల్లో జనం బారులు తీరడం కనిపించింది. ఈ క్రమంలో.. ఓ మహిళ ప్రదర్శించిన ఫొటో అందరి దృష్టిని ఆకర్షించింది. 'ఆంధ్ర రాష్ట్రానికి ఒక్కడే రారాజు' అంటూ జగన్ చిత్రాన్ని చూపించడం సోషల్ మీడియాలోనూ చర్చకు దారితీసింది. చుట్టుపక్కల మహిళలు, కార్యకర్తలు ఆ ఫొటోను పైకి ఎత్తి పట్టుకోగా.. పలువురు ఆ ఫొటోతో సెల్ఫీల కోసం ఎగబడ్డారు. అదే సమయంలో.. రాసిపెట్టుకోండి 2029లో జగనే సీఎం, వైఎస్ జగన్ మా దేవుడు అంటూ కొందరు ఫ్లెక్సీలు ప్రదర్శించారు. జగన్ పర్యటనలపై ప్రభుత్వం గత రెండేళ్లుగా ఆంక్షలు విధిస్తోంది. కేసులు పెడతామని నేతలను, ఆ వైపు వెళ్లనీయకుండా సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతోంది. అదేసమయంలో సరైన భద్రత కల్పించకుండా.. డ్రామాలు ఆడుతోంది. అయితే బారికేడ్లు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసినా ప్రజల అభిమానం మాత్రం తగ్గడం లేదు. రాజకీయంగా చూస్తే.. ప్రతి పర్యటనలోనూ కనిపిస్తున్న జన స్పందన వైఎస్సార్‌సీపీకి బలాన్ని చేకూరుస్తోంది. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నాయకుడిపై అభిమానం ఉంటే జనాలు స్వచ్ఛందంగా తరలివస్తారనే వాదనకు జగన్ పర్యటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి.ం

## 4 నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు చర్యలు

ఏలూరు,ఆగష్టు, 5 : జిల్లాలో 7 నియోజకవర్గాలకుగాను 4 నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, మరో 3 నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ . యువరాజ్ కి చెప్పారు. నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు, వాటిల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుండి పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ . యువరాజ్ రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు, ఎంఎస్ఎంఈ పార్కులలో రోడ్లు, వంటి మౌలిక సదుపాయాలను త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జిల్లాలో చేపట్టిన చర్యలు గురించి పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ కి వివరించారు. ఏలూరు జిలాల్లో చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు తుది దశలో ఉందన్నారు. ఏలూరు పోలవరం, కైకలూరు లో పురోగతిలో ఉన్నాయని, దెందులూరు, నూజివీడు, ఉంగుటూరు నియోజకవర్గాలలో భూసేకరణ దశలో ఉన్నాయన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, డిఆర్ఓ శ్రీదేవి, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాలకల్పన జోనల్ మేనేజర్ బాబ్జి, ప్రభృతులు పాల్గొన్నారు.

క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక






# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.





# విడుదలకు సిద్ధం అవుతున్న కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో-కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది.



# నిఖిల్ సరసన సంయుక్తా మీనన్

సినిమా సినిమాకు కొత్తదనంతో కూడిన కథలను ఎంపిక చేసుకుంటూ హిట్స్‌ను ఖాతాలో వేసుకుంటు న్నాడు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ. ఈ యంగ్ యాక్టర్ తొలిసారి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం స్వయంభు. ఈ మూవీలో మలయాళ బ్యూటీ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా చాలా రోజుల తర్వాత షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా గురించి ఆసక్తికర అప్‌డేట్ అందించింది నిఖిల్ అండ్ మేకర్స్ టీం. స్వయంభు టీం.. ఒక పురాతన కాలం బ్యాక్‌డ్రాప్‌లో సాగే యుద్ధ ఎపిసోడ్‌ను భారీ స్థాయిలో చిత్రీకరిస్తోంది. 12 రోజులపాటు జరుగనున్న ఈ షెడ్యూల్‌ను రూ.8 కోట్ల భారీ బ్జడెట్‌తో షూట్ చేస్తున్నారు. నిఖిల్ యాక్షన్, స్టంట్స్‌తో సాగే ఈ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతుందని మేకర్స్ ట్వీట్ చేశారు. తాజా అప్‌డేట్‌తో సినిమా స్టన్నింగ్‌గా గూస్‌బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని అర్థమవుతోంది. స్వయంభు చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నిఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ బ్జడెట్‌తో వస్తోంది. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.





# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు.

# నేషనల్ క్రష్.. అభిమానులు ఇచ్చిన ట్యాగ్

'యానిమల్'తో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్నారు బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి. ఈ సినిమా తర్వాత యూత్‌లో ఆమెకు ఫాలోయింగ్ విపరీతంగా పెరిగింది. దీంతో ఆమె నేషనల్ క్రష్‌గా గుర్తింపు సొంతం చేసుకున్నారు. అభిమానులు తనని 'నేషనల్ క్రష్' అని పిలవడంపై తాజాగా త్రిప్తి స్పందించారు. ఆ ట్యాగ్ విషయంలో తాను ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే, యాక్టింగ్‌ను నేను సీరియస్‌గా తీసుకోలేదు. మొదటి సినిమా పూర్తైన తర్వాత కెరీర్‌ను విధికే వదిలేశా. 'ఒక సినిమా పూర్తి చేశా. అదృష్టం ఉంటే రెండో సినిమా రావొచ్చు' అనుకున్నా. అలాంటి సమయంలో 'లైలా మజ్ను' కోసం ఆడిషన్‌లో పాల్గొన్నా. ఆనాటి నుంచి యాక్టింగ్‌పై దృష్టిపెట్టా. నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారు. నేషనల్ క్రష్ అనేది నా దృష్టిలో ట్యాగ్ మాత్రమే కాదు. అభిమానుల ప్రేమ. వాళ్లు నన్ను అలా పిలుస్తున్నందుకు ఆనందంగా ఉన్నా.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com